# వ్యవసాయం
సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

సెప్టెంబర్, 2017
శ్రీ హేవళంబి నామ సం॥
భాద్రపద శు॥ దశమి మొ॥
ఆశ్వయుజ శు॥ దశమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ చల్లా వేణుగోపాల రెడ్డి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ ఆర్. జగదీశ్వర్, ప్రధాన శాస్త్రవేత్త (వరి)&హెడ్

డా॥ యం. గోవర్ధన్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)

పర్యవేక్షణ

డా॥ వాంకుడోతు రవిందర్ నాయక్

సీనియర్ శాస్త్రవేత్త


వ్యవసాయ మాసపత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి.డి. అయితే **Principal Agril. Information Officer, AI&CC & PJTSAU Press** పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి.


చిరునామా :
ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్., రాజేంద్రనగర్,
హైదరాబాద్ - 30, తెలంగాణ రాష్ట్రం
ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.................................... 5
2. ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.............6
3. వాతావరణం - పంటల పరిస్థితి - విశ్లేషణ................ 11
4. సాంకేతిక వ్యాసాలు
   - వరి విత్తనోత్పత్తి పొలంలో పాటించవలసిన మెళకువలు.. 12
   - వరిలో ఉల్లికోడు మరియు సస్యరక్షణ....................... 14
   - ప్రత్తిలో ప్రస్తుతం చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు........15
   - చెఱకు తోటల్లో జడచుట్ల వలన కలిగే ప్రయోజనాలు.... 18
   - సోయాచిక్కుడులో తీసుకోవలసిన జాగ్రత్తలు................20
   - వర్షాధార వ్యవసాయంలో నీటికుంటలు - ప్రాముఖ్యత....24
   - ఖరీఫ్ పంటల అంచనా ధరలు ..............................27
   - మామిడి ముదురు తోటల పునరుద్ధరణ..................... 28
   - మిరప నాటు సమయం మరియు తొలి దశలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు............................ 30
   - పొట్లకాయలోని పోషక విలువలు మరియు ఆర్థిక అంశాలు........................................................ 33
   - గులాబిని ఆశించే చీడపీడలు-సస్యరక్షణ.................. 35
   - సెప్టెంబర్ మాసంలో ఉద్యాన పంటలలో సేద్యపు పనులు................................................ 37
   - జాగ్రత్తలు పాటించకపోతే నష్టాల "పాలే"!.................. 39
   - రంగు రంగుల ఆహారం - ఆరోగ్యానికి సోపానం......... 41
5. టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు................................................. 43
6. రైతుల సమస్యలు-శాస్త్రవేత్తల సలహాలు.................... 45
7. విశ్వవిద్యాలయ వార్తలు.................................. 48
8. రైతు విజయగాథలు
   - ప్రత్తిలో పెసరని అంతర పంటగా సాగు..................... 49
   - కూరగాయల సాగుతో లాభాలు ఆర్జిస్తున్న రైతు............ 50

# సెప్టెంబర్ మాసం క్యాలెండర్ –2017

## శ్రీ హేవళంబి నామ సం॥ భాద్రపద శు॥ దశమి వరకు ఆశ్వయుజ శు॥ దశమి వరకు

| SUN ఆది రాహుకాలం సా. 4.30–6.00 | MON సోమ రాహుకాలం ఉ. 7.30–9.00 | TUE మంగళ రాహుకాలం మ. 3.00–4.30 | WED బుధ రాహుకాలం మ, 12,00–1.30 | THU గురు రాహుకాలం మ. 1.30–3.00 | FRI శుక్ర రాహుకాలం ఉ. 10.30–12.00 | SAT శని రాహుకాలం ఉ. 9.00–10.30 |
|---|---|---|---|---|---|---|
| ❖ | ❖ | ❖ | ❖ | ❖ | **1** భాద్రపద శు॥ దశమి ఉ.6-23, పూర్వాషాఢ పూర్తి, ప.వ.3-28 ల 5-14 | **2** ఏకాదశి ఉ.8-17, పూ.షా. ఉ.7-22, సా.వ.4-06 ల 5-51 |
| **3** ద్వాదశి ఉ. 9-54, ఉత్తరాషాఢ ఉ.9-35, ప.వ.1-53 ల 3-36 | **4** త్రయోదశి ఉ.11-05, శ్రవణం ఉ.11-23, ప.వ. 3-49 ల 5-36 | **5** చతుర్దశి ఉ.11-50, ధనిష్ఠ ప.2-02, రా.వ.9-06 ల 10-40 | **6** పూర్ణిమ ప.12-04, శతభిషం ప.1-36, రా.వ.8-06 ల 9-43 | **7** బ॥ పాడ్యమి ఉ.11-47, పూర్వాభాద్ర ప.1-58, రా.వ.11-32 ల 1-08 | **8** విదియ ఉ.11-02, ఉత్తరాభాద్ర ప.1-55, రా.వ.1-39 ల 3-13 | **9** తదియ ఉ.9-50, రేవతి ప.1-23, వర్జ్యం లేదు. |
| **10** చవితి ఉ.8-17, అశ్విని ప.12-48, ఉ.వ.8-54 ల 10-27, రా.వ.9-48 ల 11-18 | **11** పంచమి ఉ.6-24, షష్ఠి తె.4-12, భరణి ఉ.11-17, రా.వ.10-33 ల 12-04 | **12** సప్తమి రా.1-52, కృత్తిక ఉ.9-50, రా.వ.12-46 ల 2-15 | **13** అష్టమి రా.11-28, రోహిణి ఉ.8-14, ప.వ.1-26 ల 2-56 | **14** నవమి రా.9-02, మృగశిర ఉ.6-34, ఆర్ద్ర తె.4-55, ప.వ.2-23 ల 3-53 | **15** దశమి రా.6-40, పునర్వసు తె.3-22, సా.వ.4-08 ల 5-38 | **16** ఏకాదశి సా.4-26, పుష్యమి రా.1-59, ఉ.వ.10-54 ల 12-24 |
| **17** ద్వాదశి ప.2-27, ఆశ్రేష రా.12-53, ప.వ.2-12 ల 3-43 | **18** త్రయోదశి ప.12-44, మఖ రా.12-04, ప.వ.12-28 ల 2-01 | **19** చతుర్దశి ఉ.11-21, పుబ్బ రా.11-38, ఉ.వ.7-55 ల 9-29 | **20** అమావాస్య ఉ.10-25, ఉత్తర రా.11-39, ఉ.వ.6-50 ల 8-26 | **21** ఆశ్వయుజ శు॥ పాడ్యమి ఉ.9-58, హస్త రా.12-09, ఉ.వ.8-13 ల 9-52 | **22** విదియ ఉ.10-00, చిత్త రా.1-09, ఉ.వ.8-29 ల 10-09 | **23** తదియ ఉ.10-34, స్వాతి రా.2-37, ఉ.వ.7-06 ల 8-47 |
| **24** చవితి ఉ.11-39, విశాఖ తె.4-32, ఉ.వ. 8-40 ల 10-23 | **25** పంచమి ప.1-09, అనూరాధ పూర్తి, ఉ.వ.8-54ల10-39 | **26** షష్ఠి ప.3-00, అనూరాధ ఉ.6-47, ప.వ.12-58 ల 2-44 | **27** సప్తమి సా.5-01, జ్యేష్ఠ ఉ.9-19, సా.వ.6-11 ల 7-58 | **28** అష్టమి రా.7-04, మూల ఉ.11-56, ఉ.వ.10-09 ల 11-56, రా.వ.10-32 ల 12-18 | **29** నవమి రా.9-00, పూర్వాషాఢ ప.2-27, రా.వ.11-12 ల 12-57 | **30** దశమి రా.10-38 ఉత్తరాషాఢ సా.4-43, రా.వ.9-01 ల 10-45 |

2 బక్రీద్(ఈద్–ఇ–గదీర్)   20 బతుకమ్మ ప్రారంభం   28 దుర్గాష్టమి   30 విజయ దశమి/దసరా   29 మహర్నవమి

**పుబ్బ కార్తె (31.08.17 నుండి 12.09.17)**

| | |
|---|---|
| వరి | : రసాయనిక ఎరువులు వేయుట, సస్యరక్షణ, కలుపు తీయుట, ఎలుకల నిర్మూలన |
| జొన్న | : రబీ జొన్న వేయుటకు దుక్కులు తయారు చేయుట. |
| వేరుశనగ | : సస్యరక్షణ, కలుపు తీయుట. |
| సోయాచిక్కుడు | : పైరు కోయుట. |
| ప్రొద్దుతిరుగుడు | : సస్యరక్షణ, ఎరువులు వేయుట. |
| చెఱకు | : అడ్సాలి పంట వేయుట. |
| ఆముదం | : సస్యరక్షణ, ఎరువులు వేయుట. |

**ఉత్తర కార్తె (13.09.17 నుండి 26.09.17)**

| | |
|---|---|
| సజ్జ | : రబీ పంటలకు రసాయనిక ఎరువులు వేయుట, విత్తుట. |
| వేరుశనగ | : సస్యరక్షణ. |
| ఆముదం | : సస్యరక్షణ. |
| ప్రత్తి | : సస్యరక్షణ. |
| సజ్జ | : కోతలు. |
| నువ్వులు | : జూన్ నెలలో వేసిన పైరు కోతలు. |
| ప్రత్తి | : సస్యరక్షణ. |

# వ్యవసాయ రంగంపై వస్తు, సేవల పన్ను [జీఎస్‌టి] ప్రభావం



డా॥ వి. ప్రవీణ్ రావు
ఉపకులపతి

దాదాపు 160 దేశాలలో అమలవుతున్న వస్తు, సేవల పన్ను (జీఎస్‌టి) అనేది భారత దేశంలో పరోక్ష పన్నుల సంస్కరణలో ఒక ముఖ్యమైన ముందడుగు. వస్తువులు మరియు సేవలపై విధించే ఈ పన్ను మన దేశంలో జూలై 1, 2017 నుండి ప్రవేశ పెట్టారు.

ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ అనే విధానంతో ఈ జీఎస్‌టి అమలు వల్ల జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనాలు చేకూరుతాయి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మన దేశంలో ఈ రంగంపై వస్తు సేవల పన్ను ప్రభావంపై అవగాహన అవసరం. జీఎస్‌టి ద్వారా వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న ప్రస్తుత పన్నులను విలీనం చేయటం ద్వారా జాతీయ వ్యవసాయ మార్కెట్‌కు అనుకూలత చేకూరి మార్కెటింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచే అవకాశముంది. పారదర్శకత, విశ్వసనీయత మరియు సమయపాలన వలన సప్లయి చైన్ పనితీరు మెరుగుపరచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. వ్యర్థాల వలన కలిగే నష్టాన్ని తగ్గించి వ్యవసాయ ఉత్పత్తుల ధరల్ని నియంత్రిస్తుంది. అంతరరాష్ట్ర రవాణా సమయాన్ని తగ్గిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన సేవా పన్ను మినహాయించబడి, వ్యవసాయదారుడు పన్ను చెల్లించనవసరం లేని వ్యక్తిగా పరిగణించబడతాడు. వ్యవసాయం, ఆహారధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, పాలు వంటి వాటిని ఈ పన్ను నుంచి మినహాయించారు. ప్రస్తుత VAT ప్రకారం మినహాయించబడిన అన్ని ప్రాథమిక వ్యవసాయ వస్తువులపై జీఎస్‌టిలో కూడా పన్నులు విధించబడవు. యూరియా, డిఎపి, పొటాష్ వంటి ఎరువులపై పన్ను 12% నుండి 5%కు తగ్గించబడుతాయి. ఈ పన్ను విధానం వలన రాష్ట్రాలు మరియు కేంద్రం మధ్య పన్ను విధానంలో సమానత్వం తీసుకురావటానికి సాధ్యపడుతుంది. జీఎస్‌టి ద్వారా అంతర రాష్ట్ర వాణిజ్యం పెంపొందించడానికి అవకాశం ఉంటుంది. ఈ అంశాలు రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగం అభివృద్ధికి సోపానమవుతాయి.

అయితే, ప్రాసెస్ చేయని ఆహారానికి మినహాయింపు పరిమితంగా ఉండడంతో తృణధాన్యాలు సహా అనేక ఆహార వస్తువులపై 4% గా ఉన్న వ్యాట్ 8% కి పెరిగింది. వ్యవసాయ దిగుమతులపై విధిగా కస్టమ్స్ సుంకం కొనసాగుతుంది. విత్తనాలు, పురుగుమందులు మరియు వ్యవసాయ పరికరాల ధరలు పెరగటం వలన రైతులకు ఉత్పత్తి ఖర్చు పెరిగే అవకాశం ఉంది. మునుపటిలా, వివిధ రాష్ట్రాల్లోని చట్టాల మధ్య వ్యత్యాసాలు లేకపోవటంతో అన్ని రాష్ట్రాల్లో స్థిరమైన ధరల వలన, తక్కువ ధరలకు పంట ఉత్పాదకాలు పొందడం కష్టం కావచ్చు. అలాగే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలకు ప్రస్తుతం ఉన్న 5% వాట్ రేట్లు జీఎస్‌టి ద్వారా 18% కు, పురుగుమందుల స్ప్రేయర్లపై 6% నుంచి 18% వరకు, మరియు ఎలక్ట్రిక్ మోటార్ల పై 7% నుండి 12% వరకు పెరిగాయి. ప్రస్తుతం ట్రాక్టర్లపై 5% గా ఉన్న పన్ను 12% లేదా 28% వరకు విధించబడుతుంది. ప్రస్తుతం తరచూ, విభిన్న రాష్ట్రాల్లో అమలుచేసిన వైవిధ్యమైన పన్నుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులకు ఇప్పటి వరకు కేంద్రం అందించే పన్ను మద్దతును ఈ విధానం కష్టతరం చేస్తుంది.

కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పెరుగుదల ఊహించిందే అయినప్పటికి, ముందు ముందు జీఎస్‌టి అమలు చాలా లాభం చేకూర్చగలదు. దీర్ఘకాలంలో రైతులు/పంపిణీదారులు, సంఘటిత జాతీయ వ్యవసాయ మార్కెట్ ఉన్నందున, రైతులు తమ ఉత్పత్తులను మెరుగైన ధరలకు విక్రయించగల అవకాశం జీఎస్‌టి కల్పిస్తుంది. ఏమయినప్పటికినీరైతు సోదరులకు ఉపయోగం చేకూర్చే విధంగా జీఎస్‌టి పై వారు పూర్తి అవగాహన పెంచుకొని తమకు లాభదాయకంగా ఉండేవిధంగా వ్యవసాయంలో ముందుకెళ్ళాలని ఆశిస్తూ....



ఉపకులపతి

## వరి

- ఎట్టి పరిస్థితులలో కూడా వరిని నార్లు ఇప్పుడు పోసుకొనరాదు. ఎందుకంటే పూత సమయంలో చలి వలన దిగుబడులు తగ్గడమే కాకుండా వివిధ రకాలైన చీడపీడలు ఆశించి నష్టం వాటిల్లుతుంది. కావున రైతులు రబీ పంటగా నవంబర్ 15 తర్వాత స్వల్పకాలిక రకాలను ఎన్నుకొని విత్తుకోవాలి.
- ప్రస్తుతం వరి పైరు ప్రాంతాలను బట్టి పిలక దశ నుండి అంకురం వేసే దశలో ఉన్నది. ఈ దశలో కాంప్లెక్స్ ఎరువులు వాడకుండా కేవలం అంకురం దశలో ఉన్న వాటికి యూరియా 25-35 కిలోలు మరియు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 15-20 కిలోలు/ఎకరానికి వేయాలి. పిలక దశలో ఉన్న పైరుకు ఎకరానికి 25-35 కిలోల యూరియా వేయాలి.
- ఈ మాసంలో వరిని ముఖ్యంగా ఉల్లికోడు, కాండం తొలిచే పురుగు, ఆకునల్లి, సుడిదోమ ఆశించవచ్చు. వీటిని ఎప్పటికప్పుడు గమనించుకొని వివిధ పురుగులకు సిఫారసు చేయబడిన సస్యరక్షణ పద్ధతులను అవలంభించాలి.
- **ఉల్లికోడు:** నాటిన 15-20 రోజులలోపు కార్బోఫ్యూరాన్ 3జి ఎకరానికి 10 కిలోలు
- **కాండం తొలిచే పురుగు:** కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 యస్‌పి @ 2 గ్రా./లీ. (పిలకదశలో ఉన్న పైరులో) లేదా క్లోరాన్‌ట్రానిలిప్రోల్ @ 0.3 మి.లీ./లీ. (అంకురం దశలో)
- **సుడిదోమ:** ముఖ్యంగా దోమ ఉధృతికి దోహదపడే మందులైన ప్రొఫెనోఫాస్, క్లోరిపైరిఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్స్ మందులైన లామ్డాసైహాలోత్రిన్, డెల్టామెత్రిన్ వంటి వాటిని మరియు వాటి మిశ్రమాలు కల్గిన మందులను లేదా బయో మందులను ఈ దశలో వాడరాదు.

  దోమ ఉధృతిని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా బుప్రోఫెజన్ 1.6 మి.లీ./లీ. లేదా డైనోటెప్యూరాన్ 0.4 గ్రా./లీ. లేదా పైమిట్రోజైమ్ 0.6 గ్రా./లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్+ఎథిప్రోల్ 0.25 మి.లీ./లీ. వంటి మందులను మార్చి మొక్క మొదళ్ళు తడిచేలా పిచికారి చేయాలి. ఉధృతి గమనించిన వెంటనే పొలాన్ని అడపాదడపా ఆరగట్టాలి.
- **ఆకునల్లి:** డైకోఫాల్ 5.0 మి.లీ./లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1.0 మి.లీ./లీ. నీటికి.
- వివిధ తెగుళ్ళ నివారణకు గాను ముందస్తు చర్యగా కార్బండాజిమ్+మ్యాంకోజెబ్ మిశ్రమ, శిలీంధ్ర నాశిని @ 2.5 గ్రా./లీ. లేదా ప్రొపికొనజోల్ @ 1.0 మి.లీ./లీ. నీటికి కలిపి అవసరం మేరకు 1-2 సార్లు పిచికారి చేయాలి.
- **కాండంకుళ్ళు** ఆశించే ప్రాంతాలలో పైపాటు యూరియాతో పాటు కార్బండాజిమ్+ మాంకోజెబ్ మిశ్రమ శిలీంధ్రనాశిని @ 2.5 గ్రా./ కిలో యూరియాతో పట్టించి బురద పదునులో వేసినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి.

డా॥ ఆర్. జగదీశ్వర్, ప్రధాన శాస్త్రవేత్త (వరి), వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 8179540261

## మొక్కజొన్న

- రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి సమయంలో నీటి వసతి ఉన్న రైతులు ముఖ్యంగా పూత దశలో ఉన్న మొక్కజొన్నకు ఒకటి లేక రెండు తడులు ఇచ్చినచో దిగుబడులు తగ్గకుండా పంటను కాపాడుకోవచ్చును.
- పూతదశలో ఉన్న పైరుకు ఎకరాకు 50 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పై పాటుగా వేయాలి. ఎరువులు వేసిన వెంటనే తేమలేనట్లయితే నీటి తడిని ఇవ్వాలి.
- పేనుబంక ఆశించినచో డైమిథోయేట్ 30 ఇ.సి. 2 మీ.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- ఆకు మాడు తెగుళ్ళు ఆశించిన పైరుకు మాంకోజెబ్ ను 2.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- నీటి వసతి వున్న రైతులు యాసంగిలో మొక్కజొన్నను సెప్టెంబరు 15వ తేది తర్వాత విత్తుకొనవచ్చును.

డా॥ వి.నర్సింహా రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న), మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 8008123671

## చిరుధాన్యాలు

**జొన్న:** ఖరీఫ్‌లో విత్తిన జొన్న పంట ప్రస్తుతం పూత మరియు గింజ కట్టు దశలో ఉన్నది.

- ఈ సమయంలో వర్షం కురిసినట్లైతే లేదా ఒక్క తడి అందజేసి ఎకరాకు 30 కిలోల యూరియాను వేసుకోవాలి.
- వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు గింజలు నల్లబడే అవకాశం ఉంది. కావున వర్షాలు తగ్గిన వెంటనే కంకులపై ప్రొఫికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మాఘీలో జొన్న విత్తుకున్నప్పుడు కిన్నెర, సిఎస్‌హెచ్-16 లేదా సిఎస్‌హెచ్-23 రకాలను ఎంచుకోవాలి. కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 12.5 మి.లీ. చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**సజ్జ:** ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటికి ఎలాంటి పంట వేయని రైతులు వర్షాలు ఒక మోస్తరు నుండి భారీగా పడితే ఎర్ర చల్కా నేలల్లో సజ్జ పంటను సెప్టెంబర్ నెల అంతా విత్తుకోవచ్చును.

- సజ్జలో పిహెచ్‌బి-3 లేదా హెచ్‌హెచ్‌బి-67 వంటి అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ వంగడాలను ఎంచుకోవచ్చును.

## వేరుశనగ

- ఖరీఫ్‌లో విత్తిన వేరుశనగ పంటపై లద్దెపురుగు ఆశించినట్లైతే నివారణకు థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా విషపు ఎరను వాడి కూడా నివారించు కోవచ్చును.
- తామర పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.5% ఎస్ఎల్ 0.4 మి.లీ./ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### తెగుళ్ళు

- లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది. కావున పంటపై తెగుళ్ళ లక్షణాలు కనిపించిన వెంటనే హెక్సాకొనజోల్ 2 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- రబీ వేరుశనగ పంటను సెప్టెంబర్ రెండవ పక్షం నుండి విత్తుకోవచ్చును.
- ఎకరానికి 75-80 కిలోలు ఒలిచిన గింజలను 1గ్రా. టెబ్యుకొనజోల్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- కదిరి-6, కదిరి-9 వంటి అధిక దిగుబడినిచ్చే రకాలు ఎంచుకోవాలి.
- మొక్కల సాంద్రత (44 మొక్కలు/ఒక చ.మీ.) సరిగా ఉండేటట్లు, వరుసల మధ్య 22.5 సెం.మీ. మరియు మొక్కల మధ్య 10 సెం.మీ. ఉండేలా విత్తుకోవాలి.

## ఆముదం

- పంట విత్తిన 60 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. గుంటక లేదా గొర్రుతో అంతరకృషి చేసి కలుపును నివారించాలి. భూమిలో తేమ ఉన్నప్పుడు ఎకరానికి 15 కిలోల యూరియాను వేయాలి.
- రసం పీల్చే పురుగులను గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ./లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.
- దాసరి పురుగు పంటను ఆశించినట్లైతే మోనోక్రోటోపాస్ 2 మి.లీ. మరియు డైక్లోరోవాస్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారి చేయాలి. దాసరి పురుగులు పెద్దవిగా ఉన్నప్పుడు వాటిని ఏరి నాశనం చేయాలి. పొలంలో 10 పక్షి స్థావరాలను పక్షులు వాలేందుకు వీలుగా అమర్చినట్లైతే పొలంలోకి పక్షులు వచ్చి పురుగులను ఏరి తింటాయి.
- పొగాకు లద్దె పురుగు ఆశించిన పొలంలో జల్లెడాకులను ఏరి నాశనం చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా విషపు ఎరను పెట్టాలి. విషపు ఎరను తయారు చేయడానికి 10 కిలోల వరి తవుడు+ 1 కిలో బెల్లం+ఒక లీటరు మోనోక్రోటోఫాస్ తగినంత నీటితో కలిపి చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళలో చాళ్ళ మధ్యలో వేయాలి.

- ఎండు తెగులును గమనించినట్లైతే మొక్క మొదళ్ళలో కార్బండాజిమ్ 1 గ్రా./ లీ. నీటికి కలిపిన ద్రావణంను పోయాలి. అదేవిధంగా చుట్టు ప్రక్కల ఉన్న మొక్కలకు కూడా పోయాలి. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- వర్షాలు అధికంగా పడి గాలిలో తేమ ఎక్కువగా ఉండడం వలన జూబు తెగులు ఆశించే ఆస్కారముంది. కావున వాతావరణం హెచ్చరికలను అనుసరించి వర్షానికి కనీసం 4-6 గంటల ముందు కార్బండాజిమ్ 1గ్రా./లీ. నీటికి కలిపి గెలలపై పిచికారి చేయాలి. తెగులు సోకిన గెలలను కోసి దూరంగా వేసి తగులబెట్టాలి. ఎకరానికి 15-20 కిలోల యూరియాను వేసుకోవాలి.

## నువ్వులు

- ఆగష్టు మాసంలో విత్తుకున్న నువ్వు పంట ప్రస్తుతం మొలక/శాఖీయ దశలో ఉంటుంది.
- ఆకు తినే పురుగులు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బెట్ట పరిస్థితులు ఏర్పడితే పలుచటి నీటి తడిని అందజేసి ఎకరానికి 15-20 కిలోల యూరియాను అందజేయాలి.

**డా॥ ఎం.వి.నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు, నూనెగింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం. ఫోన్ నెం. 8008404874**

## అపరాలు

- 3-4 తడులు ఇచ్చే అవకాశమున్నచో రబీలో నీటి పారుదల క్రింద పెసర/ మినుము/కంది పంటలను సాగు చేయవచ్చును. చౌడు నేలలు తప్ప నీరు బాగా యింకే తటస్థ నేలలు అనుకూలమైనవి.
- పెసరలో డబ్ల్యు.జి.జి-37, యమ్.జి.జి-295, యమ్.జి.జి-347, టి.యమ్-96-2, యమ్.జి.జి-351 మరియు డబ్ల్యు.జి.జి-42 అనుకూలమైన రకాలు.
- మినుములో పి.యు-31, యల్.బి.జి-752, యల్.బి.జి-787, యమ్.బి.జి-207 మెట్ట సాగుకు అనుకూలమైన రకాలు.
- కందిలో మధ్య కాలిక రకాలైన డబ్ల్యు.ఆర్.జి-53, డబ్ల్యు.ఆర్.జి-65, యమ్.ఆర్.జి-1004, ఐ.సి.పి.యల్. 85063, ఎల్.ఆర్.జి-41, టి.డి.ఆర్.జి-4, ఐ.సి.పి.హెచ్.-2740 రకాలను సాగుచేయవచ్చును. రబీలో కందిలో స్వల్పకాలిక రకాలను సాగుచేయకూడదు.
- పెసర / మినుములో ఎకరానికి 6 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి 5.0 మి.లీ మోనోక్రోటోఫాస్ + 2.5 గ్రా. థైరేన్ ఎమ్-45 తో పాటుగా ఆఖరుగా విత్తే ముందు ఎకరా విత్తనానికి 200 గ్రా.ల రైజోబియమ్ కల్చర్‌ను పట్టించి నీడలో ఆరబెట్టి తగు పదనులో విత్తుకోవాలి. పెసర / మినుము సాళ్ళ మధ్య 30 సెం.మీ, మొక్కల మధ్య 10 సెం.మీ ఎడంతో సాళ్ళ పద్ధతిలో విత్తుకొని చదరపు మీటరుకు 33-40 మొక్కలు వుండేలా విత్తుకోవాలి.
- రబీలో కందిలో ఎకరానికి 6 కిలోల విత్తనం వాడాలి. 2.5 గ్రా. కాప్టాన్ లేదా థైరామ్ మరియు 8 గ్రా. ట్రైకోడర్మావిరిడి ప్రతి కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కందిని చౌడు నేలలు తప్ప అన్ని రకాల నేలలో సాగు చేయవచ్చును. నేల స్వభావాన్ని బట్టి సాళ్ళ మధ్య 60-75 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ ఎడంతో బోదె కాల్వల పద్ధతిలో విత్తుకోవాలి.
- పెసర / మినుము / కంది పంటలను సెప్టెంబర్ 15 నుండి విత్తుకోవచ్చును. రబీలో సకాలంలో విత్తినచో మంచి దిగుబడులు పొందవచ్చును. విత్తుకునే దుక్కి బాగా తయారుచేసి ఆఖరు దుక్కిలో 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరంనిచ్చే ఎరువులు అనగా 18-20 కిలోల యూరియా, 125 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ వేయాలి.
- విత్తిన 24-36 గంటలలో కలుపు నివారణకై పెండిమిథాలిన్ 1.25 లీటర్లు ఎకరానికి (5 మి.లీ/ లీటరు నీటికి) 200 లీటర్ల నీటిలో కలిపి సమంగా పిచికారి చేయాలి. మొలచిన తర్వాత గుంటుక తోలి, విత్తిన 25-30 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి.

### ఖరీఫ్‌లో విత్తిన పంటలలో

- కందిలో నాగలి / గుంటుక తోలి కలుపును నివారించాలి.
- అధిక వర్షపాతం కురిసినచో ఎప్పటికప్పుడు నీరు నిల్వవుండకుండా జాగ్రత్త పడాలి.
- అధిక తేమ కారణంగా ఎదుగుదల లోపించినచో 2 శాతం (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణం వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- కందిలో స్వల్పకాలిక పంటలను కోసిన తర్వాత తగు పదనులో పంట అవశేషాలను దుక్కిలో కలియదున్ని ఆ తర్వాత లోతైన కాల్వలను ఏర్పరచి వర్షపు నీటిని ఇంకింప చేసినచో పూత, పిందె సమయంలో కంది బెట్టకు గురికాకుండా మంచి దిగుబడులు పొందవచ్చును.
- ఆలస్యంగా విత్తిన పెసర / మినుము పూత మరియు కాయ దశలో వున్నవి. కాయ తొలుచు పురుగు మరియు మరుకా మచ్చల పురుగు ఆశించినచో నివారణకై 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ మరియు 1.0 మి.లీ. డైక్లోరోవాస్ ప్రతి లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురిసే పరిస్థితులలో పొగాకు లద్దె పురుగు ఆశించి నష్ట పరుచును. నివారణకై తయోడికార్బ్ 1.5 గ్రా. ప్రతి లీటరు నీటికి కలిపి పొడి వాతావరణంలో పిచికారి చేయవలెను.
- పెసరలో పంట పరిపక్వతను గుర్తించి 80 శాతం కాయలు తయారైన తర్వాత నేరుగా కోయవచ్చు లేదా హార్వెస్టర్ ఉపయోగించి యాంత్రికంగా కూడా కోత మరియు నూర్పిడి ఏకకాలంలో చేసుకోవచ్చును.
- యాంత్రికంగా కోసేటప్పుడు చేను బాగా ఎండనిచ్చి, లీటరు నీటికి 4 మి.లీ. పారాక్వాట్ కలిపి పరిపక్వత సమయంలో పంటపై పిచికారి చేసినచో ఆకులను రాల్చి, కోత కోయుటను సులువుగా వుండి నాణ్యమైన ఉత్పత్తి కూడా వచ్చును.
- విత్తనాన్ని బాగా శుభ్ర పరచి 9-10 శాతం తేమ వుండేలా ఎండనిచ్చి క్రొత్త గోనె సంచులలో నింపి గాలి వెలుతురు సోకే గదిలో చెక్క బల్లలపై నిల్వచేయవలెను.

డా॥పి. జగన్‌మోహన్ రావు, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9849133493

## ప్రత్తి

ప్రత్తి పంట ప్రస్తుతం మంచి పూత, కాత దశలో ఉంది. ఈ దశలో పంటకు ప్రధానంగా పోషకాల ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. భూమి ద్వారా పంటకు వేసే ఎరువులతో పాటు, పై పాటుగా పైరు ఎదుగుదలను అనుసరించి, అవసరాన్ని బట్టి 10-15 రోజుల కొకసారి పోషకాలను పిచికారి చేయాలి.

ఈ పోషకాల పిచికారికి లీటరు నీటికి 10 గ్రా. పొటాషియం నైట్రేట్ (మల్టీ-కె) లేదా 10 గ్రా. ల 19:19:19 (పాలీఫీడ్) లేదా 20 గ్రా. ల యూరియాను కలిపి చేనుపై వాడవచ్చు లేదా పిచికారి చేయవచ్చు. పోషకాలను మారుస్తూ అవసరాన్ని బట్టి పిచికారి చేసుకోవాలి. వీటిని పురుగు మందులతో కలిపి కూడా పిచికారి చేయవచ్చు. పోషకాల పిచికారి వలన పైరు ఎదుగుదల మరియు కాపు బాగుంటుంది.

పైరు 100 రోజుల వరకు ఎకరాకు ప్రతిసారి 25 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులను, 20 రోజుల వ్యవధిలో 4-5 సార్లు భూమిలో మొక్కలకు దగ్గరగా వేయాలి.

ఈ దశలో పైరులో పూత, పిందె రాలడం, ఆకులు ఎరుపు /పండాకుగా మారడం కూడా జరుగుతుంది. ఇలాంటి లక్షణాలు ఎక్కువగా ఉన్న పంటకు లీటరు నీటికి 10 గ్రా.ల మెగ్నీషియం సల్ఫేట్ మరియు 1.5 గ్రా.ల బోరాన్ / బోరాక్స్‌లను కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి మరియు దీనికి లీటరు నీటికి 10 గ్రా.ల చొప్పున యూరియాను కలిపి పిచికారి చేస్తే ఫలితం బాగుంటుంది.

పూత, పిందె మరీ ఎక్కువగా రాలుతున్నట్లయితే (యన్.ఎ.ఎ.10 పి.పి.యమ్) ప్లానోఫిక్స్ అను మందును 5 లీటర్ల నీటికి 1 మి.లీ. చొప్పున కలిపి, ఆ ద్రావణానికి లీటరు నీటికి 10 గ్రా.ల చొప్పున యూరియా / డిఎపి లేదా 10 గ్రా.ల మల్టి-కెను కలిపి 10 రోజుల వ్యవధిలో 1 లేదా 2 సార్లు పిచికారి చేస్తే, సమస్య తగ్గుతుంది. ఆగష్టు నెలలో మొదటి 10-15 రోజుల బెట్ట వాతావరణం తర్వాత చివరి 10-12 రోజులలో దాదాపు రాష్ట్రం అంతా కురిసిన అధిక వర్షాలకు ప్రత్తి చేన్లలో చాలా చోట్ల మొక్కలు తెప్ప తెప్పలుగా ఎండిపోవుట జరిగింది. ఇది బిటి ప్రత్తిలో అకస్మాత్తుగా

వాతావరణ పరిస్థితులు మారినప్పుడు వచ్చే ప్యారావిల్ట్ దీనికి గాను లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 0.1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి మొక్కల చుట్టుగా భూమిని తడపాలి. వారం తర్వాత కార్బండాజిమ్ మందును లీటరు నీటికి 1 గ్రా. చొప్పున కలిపి మరల మొక్కల చుట్టూ భూమిని తడపాలి. మొక్కలు నెమ్మదిగా కొంతవరకు తిరిగి కోలుకుంటాయి.

అధిక వర్షపాతం ఉన్నప్పుడు చేనులో ఎక్కువ నీరు నిల్వకుండా కాలువల ద్వారా బయటకు పోవునట్లు చేయాలి. వర్షాలు వెలిసిన/ఆగిన వెంటనే పైరుపై లీటరు నీటికి 2.5 గ్రా. సాఫ్ / కంపానియన్ (కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిసిన మందు) కలిపి ఒకసారి పిచికారి చేయాలి. వారం పది రోజుల తర్వాత కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే ఆకులపై వచ్చే మచ్చలు మరియు కాయలు కుళ్ళకుండా నల్లబడకుండా నివారింపబడతాయి.

ప్రస్తుతం ప్రత్తి పంటలో తామరపురుగు, పేనుబంక, పచ్చదోమ మొదలగునవి ఆశిస్తున్నాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 గ్రా.ల ఫిప్రోనిల్ / 0.2 గ్రా. థయామిథాక్సామ్/ 0.3 గ్రా. ఫ్లోనికామిడ్ / 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ / 1.25 గ్రా. డైఫెన్ థయూరాన్ లాంటి మందులను పిచికారి చేసుకోవాలి.

ఒకేసారి 2 లేదా 3 మందులు కలిపి పిచికారి చేయకూడదు మరియు మందులు మారుస్తూ పిచికారి చేయాలి.

రసం పీల్చే పురుగులే కాకుండా గులాబి రంగు కాయతొలుచు పురుగు, పొగాకు లద్దె పురుగు ఆశించకుండా గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు నివారణకు చేనులో వాటి లింగాకర్షక బుట్టలను ఎకరాకు 4 లేదా 8 చొప్పున అమర్చి పురుగు ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలి. అవసరాన్ని బట్టి థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి పిచికారి చేసి మొదటి దశలో ఉన్న పురుగులను నిర్మూలించుకోవాలి.

**శ్రీ.ఎ.సుదర్శనమ్, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9866962634**

## చెఱకు

ఈ మాసంలో వాతావరణం మబ్బుగా ఉండి 19-35 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత మరియు 80-90 శాతం గాలిలో తేమ ఉన్నప్పుడు దూదేకుల పురుగు పంటను ఆశిస్తుంది. ఇవి ఆకుల అడుగుభాగాన గుంపులు గుంపులుగా చేరి ఆకుల నుండి రసాన్ని పీల్చి వేయటం వలన ఆకులు వడలిపోతాయి. అధిక నత్రజని ఎరువుల వాడకం వలన కూడా ఈ పురుగు ఉధృతి ఎక్కువగా పంటకు వచ్చే అవకాశం ఉంటుంది. దీని నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పురుగును అరికట్టవచ్చు.

ఈ మాసంలో పిండినల్లి కూడా ఎక్కువగా పంటను ఆశించి నష్టపరుస్తుంది. పురుగులు ఆకు తొడిమెలకు, చెఱకు గడలకు మధ్య గుంపులు గుంపులుగా చేరి గడల నుండి రసాన్ని పీల్చి వేస్తాయి. పంట పక్వానికి వచ్చే సమయంలో పిండినల్లి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఎదిగిన తోటల్లో పురుగు నివారణకు ఆకులు రెలచి, బహిర్గతమైన కణుపుల మీద డైమిథోయేట్ 1.7 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఇటీవల కాలంలో ఆకుపై ఆశిస్తున్న పిండినల్లి నివారణకు కూడా పైన సూచించిన మందులను ఆకు తడిచేటట్లుగా పిచికారి చేయాలి.

బాగా ఎదిగిన తోటలు పడకుండా ఉండటానికి జడ చుట్లు వేసి మొక్కల మొదళ్ళకు మట్టిని ఎగదోయాలి. పంట పెరుగుదలను బట్టి జడచుట్టే పద్ధతి ద్వారా చెఱకును నిలబెట్టాలి. చెఱకు పంట ఎదుగుదలను బట్టి 2-3 సార్లు జడచుట్లు వేసుకుంటే తోట వడిపోకుండా నివారించుకోవచ్చు. నిజామాబాదు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దగ్గరగా ఉన్న నాలుగైదు దుబ్బులను మెలివేసి జడ చుట్టుతుంటారు. కాని ఇలా చేయటం వలన తోటకు ప్రయోజనం చేకూరదు. అయితే జడ చుట్లు వేసుకునేటప్పుడు, అడుగు బాగాన మరియు ప్రక్కన ఉన్న ఆకులను మెలివేసి 5 సెం.మీ. వ్యాసం గల గడలకు వరస పొడవునా జడచుట్లు వేసుకోవాలి. దీని వలన మొక్కకు సూర్యరశ్మి ఉపయోగించుకునే శక్తి ఎక్కువగా ఉండి తోట పడిపోకుండ ఉండి దిగుబడులు ఎక్కువగా వస్తాయి.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు), వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం - పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ బి. బాలాజీ నాయక్ మరియు యస్.బి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, ఏ.ఆర్.ఐ, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో 01.06.2017 నుండి 26.08.2017 వరకు కురిసిన వర్షపాత వివరాలు గమనిస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతం (546.8 మి.మీ. కు గాను 498.7 మి.మీ.) నమోదైంది ఇప్పటి వరకు కురిసిన వర్షపాత వివరాలను జిల్లాల వారీగా గమనిస్తే మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ మరియు జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, కరీంనగర్, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, జనగామ, యదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట మరియు ఖమ్మం జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కొమరంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల్, నిర్మల్, నిజమాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్ మరియు వికారాబాద్ జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- ప్రత్తి విత్తిన 60 రోజుల తరువాత రసం పీల్చే పురుగులను నివారించుటకు 1.6 మి.మీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయవలెను.
- నేలలో సరైన తేమ ఉన్నప్పుడు 60 మరియు 80 రోజుల ప్రత్తి పైరుకు పైపాటుగా ఎకరానికి 30-35 కి. యూరియా మరియు 10 కి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ను వేసుకోవలెను.
- ప్రత్తిలో నల్ల మచ్చ తెగులు గమనించినచో నివారణకు, 30 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ + 2 గ్రా. ప్లాంటమైసిన్ లేదా 2 గ్రా. పోశామైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 నుండి 3 సార్లు పిచికారి చేయాలి.
- కందిలో ఫైటాఫ్తొరా ఎండు తెగులు గమనించినచో నివారణకు, 2 గ్రా. మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.
- ఆలస్యంగా వరి నాట్లు వేసిన పొలాలలో ఉల్లికోడు మరియు కాండం తొలుచు పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా, నాటిన 15-20 రోజులకు 10 కి. కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను ఎకరా పొలంలో వేసుకోవలెను.
- ఆముదంలో దాసరి పురుగు ఉనికిని గమనించినట్లైతే నివారణకుపొలంలో ఎకరాకు 10 పక్షి స్థావరాలను అమర్చాలి, దాసరి పురుగు మొదటి దశలో పరాన్న జీవులకు హాని చేయని వేపనూనె 5 మి.లీ. లీటరు నీటిలో కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారి చేయాలి, పొలంలో దాసరి పురుగును ఆశించే మైక్రోప్లైటిస్ పరాన్న జీవి ఉనికిని గమనించాలి. పరాన్న జీవి ఆశించినచో ఏ విధమైన పురుగు మందులు పిచికారి చేయరాదు, పరాన్న జీవి పొలంలో లేని ఎడల 1.5 గ్రా ఎసిఫేట్ లేదా 1 మి.లీ నోవాల్యూరాన్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆశించటానికి ఆస్కారం ఉన్న చీడపీడలు :

- ప్రత్తిలో రసం పీల్చే పురుగులు
- నల్ల మచ్చ తెగులు
- కందిలో ఫైటాఫ్తొరా ఎండు తెగులు
- ఆముదంలో దాసరి పురుగు
- గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **9000407408, 9912010021**

# వరి విత్తనోత్పత్తి పొలంలో పాటించవలసిన మెళకువలు

డా|| వై. చంద్రమోహన్, డా|| కె. కృష్ణ, డా|| ఎస్.ఆర్.వి. వర్మ, డా|| యం. నాగభూషణం, డా|| ఆర్. జగదీశ్వర్
మరియు డా|| సి. వి.సాయి. సురేందర్ బాబు
వరి పరిశోధన విభాగం, వి.ఆర్.ఐ., రాజేంద్రనగర్, హైదరాబాద్

వరి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి ఎన్నుకున్న రకంతోపాటు విత్తనాల నాణ్యత చాలా ముఖ్యమైనది. తరచుగా నాణ్యత లేని విత్తనాల వలన రైతాంగం నష్టపోవడం సాధారణం. వరి స్వపరాగ సంపర్కం సిద్ధించుకునే మొక్క కాబట్టి తక్కువ శ్రమతో రైతు స్థాయిలోనే నాణ్యమైన విత్తనాలు పండించుకొని మేలైన పంట దిగుబడులు పొందే అవకాశం ఉంది.

విత్తనోత్పత్తి చేయాలనుకున్న వరి రకం యొక్క నాణ్యమైన ఫౌండేషన్ లేదా బ్రీడర్ విత్తనాన్ని ధృవీకరించిన సంస్థ లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి సేకరించి నారు పోసుకోవాలి. నారుమడిని అంతకు ముందు పంటలో వరి పండించని పొలంలో వేసుకుంటే మేలు. లేని పక్షంలో నారుమడిని సుమారు 15 రోజులు, 2-3 దఫాలుగా మురగ దమ్ము చేసి చదును చేసుకోవాలి. నారుమడిలో మొలకెత్తిన విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. నారు పీకటానికి 7-10 రోజుల ముందు 2 గుంటలకు 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి. 25-30 రోజుల వయసు నారు నాటుకోవడం మంచిది. ఆలస్యంగా ముదురు నారు నాటడం వలన పొలం ఒకేసారి ఈనక పోవడం, బెరకులు గుర్తించడం కష్టతరమవడంతో పాటు విత్తన దిగుబడి తగ్గుతుంది.

ప్రధాన పొలాన్ని బాగా మరగనిచ్చి దమ్ము చేసి చదును చేసుకోవాలి. ఆఖరి దమ్ములో సిఫారసు మేరకు ఎకరానికి 1 బస్తా డిఏపి, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి కలయదున్నుకోవాలి. విత్తనోత్పత్తికై నాటుకునేటప్పుడు ఒక కుదురుకు 1 లేదా 2 మొక్కలు మాత్రమే ఉండేలా నాటు కోవాలి. చ.మీ.కు 33 కుదుళ్ళు ఉండే విధంగా దూర దూరంగా నాటుకోవాలి. ప్రతి 2 మీ.కు ఒక అడుగు కాలి బాటలు తప్పని సరిగా వదులుకోవాలి. ఈ కాలిబాటలు పొలాన్ని తరచుగా గమనించడానికి మరియు బెరకులు గుర్తించి తీసివేయడానికి దోహదపడతాయి.

కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం మరియు నీటి యాజమాన్యం సాధారణ వరి పొలం మాదిరిగానే చేపట్టాలి. ముఖ్యంగా పొలంలో కలుపు లేకుండా మరియు గింజ గట్టిపడు దశలలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త పడాలి.

విత్తనోత్పత్తి పొలంలో ముఖ్యంగా చేయవలసినది బెరకులు ఏరివేయడం, విత్తనోత్పత్తి చేసే రకంకు ఉండవలసిన లక్షణాలు కాకుండా భిన్నమైన లక్షణాలు గల మొక్కలను బెరకులుగా గుర్తించి ఎప్పటికప్పుడు వేర్లతో సహా పీకి వేయాలి.

పంటలో మూడు దశలలో బెరకులు గుర్తించి తీసివేయాలి. మొదటగా పిలకలు వేయు దశలో మొక్క రంగు, పిలకలు వేయు స్వభావం, ఎత్తు, ఆకు ఆకారం, పరిమాణంను బట్టి బెరకులు తీసివేయాలి. రెండవ దఫా పూత దశలో ఆలస్యంగా మరియు ముందుగా పూతకు వచ్చు మొక్కలు, ఎత్తు, పొట్టి మొక్కలు గుర్తించి తీసివేయాలి. చివరగా మరియు ముఖ్యంగా కోతకు ముందు గింజ ఆకారం, పరిమాణం, రంగును బట్టి బెరకులు ఏరివేయాలి.

పిలకలు వేయు మరియు పూత దశలలో గుర్తించిన బెరకు మొక్కలను వేర్లతో సహా తీసివేయడం తప్పనిసరి. అలా కాకుండా కొడవలితో కోసినట్లయితే పంట కోత సమయానికి ఆ కోసిన బెరకు మొక్కలు పిలకలు తొడిగి త్వరగా గింజ పట్టి జన్యు స్వచ్ఛత పాడై ఉపయోగం లేకుండా పోతుంది.

విత్తనోత్పత్తి పొలానికి ముఖ్యంగా అగ్గితెగులు, పాముపొడ తెగులు, ఎండాకు తెగులు, మానిపండు తెగులు సోకకుండా తగు సమయంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి, లేని పక్షంలో ఆయా తెగుళ్ళు విత్తనం ద్వారా తరువాత పంటను ఆశించి ఎక్కువ నష్టాన్ని కలుగ జేస్తాయి.










విత్తనోత్పత్తి పొలాన్ని కూలీలతో కోసి, కుప్ప చేసి, నూర్పిడి చేసుకోవాలి. నూర్పిడి చేయు ప్రదేశంలో ఇతర వరి రకాల గింజలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. పంట కోత యంత్రాలను వాడకూడదు. విత్తనోత్పత్తి పొలం ఎక్కువ విస్తీర్ణంలో ఉండి, కూలీల కొరత ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ పరిస్థితులలో పంట కోత యంత్రాలను బాగా శుభ్రం చేసుకొని, యంత్రంలోని వివిధ భాగాలలో వరి గింజలు లేకుండా తీసివేసి పంటకోత చేపట్టాలి.

విత్తనాలను 12-13 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి, క్రొత్త లేదా బాగా శుభ్రం చేసిన గోనె సంచులలో పొడి వాతావరణంలో నిలువ చేసి వాడుకోవాలి.

**వరి విత్తనాలలో కనీస స్వచ్ఛతా ప్రమాణాలు**

| | ఫౌండేషన్ విత్తనము | సర్టిఫైడ్ విత్తనము |
|---|---|---|
| జన్యు స్వచ్ఛత | 99% | 98% |
| అసలు విత్తనం | 98% | 98% |
| ఇతర పంట విత్తనాలు | కిలోకు 10 గింజలు లేదా తక్కువ | కిలోకు 20 గింజలు లేదా తక్కువ |
| కలుపు విత్తనాలు | కిలోకు 10 లేదా తక్కువ | కిలోకు 20 లేదా తక్కువ |
| మొలక శాతం | 80% | 80% |
| తేమ | 13% | 13% |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9908577040**

# వరిలో ఉల్లికోడు మరియు సస్యరక్షణ

వై. స్వాతి మరియు బి. మాధవి

తెలంగాణాలో అత్యధికంగా సాగుచేయబడే ఆహారపు పంట వరి. ఇటీవల కాలంలో వస్తున్న వాతావరణ మార్పులు, వర్షభావ పరిస్థితులు, ఆలస్యంగా కురిసే వర్షాల వలన వరి సాగు విస్తీర్ణం తగ్గుతున్నది. అయితే ప్రస్తుత పరిస్థితులలో వరి నాటిన కొద్దిరోజుల వరకు బెట్ట పరిస్థితి, మరల ఒకేసారిగా వర్షాలు అధికమవడంతో వాతావరణంలో తేమ శాతం పెరిగి ఉల్లికోడు ఉధృతి పెరగటానికి అవకాశం ఉంది.

ఈ పురుగు ముదురు ఎరుపు రంగుతో దోమ ఆకారంలో ఉండి, ఆలస్యంగా నాట్లు వేసినప్పుడే ఎక్కువగా ఆశిస్తుంది. గ్రుడ్ల నుండి లేత ఎరుపు వర్ణంలో ఉండే పిల్ల పురుగులు బయటకు వెలువడి ఆకు కణాల మీద నుండి కాండంవైపుకు ఎగబ్రాకి అంకురంను ఆశించి పిల్ల పురుగులు విడుదల చేసే సెసిడోజెన్ అనే రసాయన మందు వలన అంకురం విచ్చక, ఉల్లికాడ లేక ఆకుపచ్చని గొట్టం లాగా మారి ఆ తర్వాత వెండి రంగులోకి మారుతుంది.



**లక్షణాలు :**

1. నారుమడి / పిలక దశలో అంకురం ఉల్లికాడ లేక ఆకువచ్చని పొడుగాటి గొట్టం లాగా మార్పు చెందుతుంది.
2. అంకురం విచ్చుకోకుండా, దుబ్బు గిడసబారి, కంకి వేయదు. దుబ్బులోని కొన్ని పిలకలు మాత్రమే ఉల్లి గొట్టాలుగా మారతాయి.
3. దీపపు ఎరలు అమర్చి ఈ పురుగులను గమనించవచ్చు.

**ఆర్థిక నష్ట పరిమితి స్థాయి :**

రైతులు తమ నారుమడి / ప్రధాన మడిలో పురుగుల సాంద్రతను గమనిస్తూ రసాయన మందులను వాడాలి. నారుమడిలో ఒక చదరపు మీటరుకి ఒక ఉల్లికోడు సోకినా, పిలకదశలో 5 శాతం ఉల్లికోడు గొట్టాలు లేక దుబ్బుకు ఒక కోడు సోకిన పిలక ఉన్నట్లయితే సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.

**సస్యరక్షణ చర్యలు :**

1. వరిని ప్రధాన పొలంలో ఆలస్యంగా నాటరాదు.
2. ఆయా ప్రాంతాలకు అనువైన ఉల్లికోడును తట్టుకునే రకాలను సాగు చేయాలి.
3. పైరు 50-60 రోజుల వయసు దాటిన తర్వాత ఉల్లికోడు ఆశించినా ఏవిధమైన సస్యరక్షణ అవసరం లేదు.
4. నారు మడిలో విత్తిన 10-15 రోజుల లోపు రెండు గుంటలకు 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జి లేదా 250 గ్రా. ఫోరేట్ గుళికలను లేదా ఆలస్యంగా నాటిన పొలంలో 10-15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా ఫోరేట్ 5 కిలోలు వేయాలి.

# ప్రత్తిలో ప్రస్తుతం చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు

డా|| బి. రాంప్రసాద్, ఎ. సుదర్శనమ్, యస్. లింగయ్య మరియు డా|| పి. రఘురామి రెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

ప్రత్తి పంట విస్తీర్ణం గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చును. ఈ సంవత్సరం సుమారుగా మన రాష్ట్రంలో 17.5 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రత్తిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రత్తి పంట 60–80 రోజుల దశలో పూత మరియు కాయ ఏర్పడే దశలో ఉన్నది. ఈ దశలో చీడపీడలను సరిగా గుర్తించి, సరైన సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టినట్లయితే, కొంత సాగు ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడులు పెరిగి, రైతులు కొంత వరకు ప్రత్తి పంటను లాభదాయకంగా సాగుచేసుకునే వీలుంటుంది.

గతకొద్ది రోజులుగా ఉన్నటువంటి వర్షాభావ పరిస్థితుల వలన ప్రత్తిలో పిండినల్లి, తెల్లదోమ సమస్య మరియు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, మబ్బులతో కూడుకున్న వాతావరణ పరిస్థితుల వలన పచ్చదోమ సమస్య, అలాగే కొన్నిచోట్ల కనబడుతున్న గులాబిరంగు కాయ తొలుచు పురుగు మరియు ఈ మధ్యనే పూతను, లేత కాయలను ఆశించి నష్టపరుస్తున్నటువంటి చాఫర్ బీటిల్స్ (పెంకు పురుగు)ను సరైన సమయంలో గుర్తించి ఈ క్రింది సస్యరక్షణ పద్ధతులను చేపట్టాలి.

### 1. పిండినల్లి

- పిండినల్లి తల్లి పురుగులు రెక్కలు లేకుండా శరీరమంతా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి.
- ఈ పురుగు ఆకు తొడిమె, ఆకులు, పూత, కాయల నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, పూత పిందె రాలుతాయి.
- పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి.



- బెట్ట వాతావరణంలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- పిండినల్లి గ్రుడ్లు అంటుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. కావున ఇవి చీమలు, నీటి పారకము, పక్షులు, మనుషులు, గాలి మరియు వ్యవసాయ పనిముట్ల ద్వారా ఒక చోట నుండి మరొక చోటికి వ్యాపిస్తాయి.
- ప్రత్తి పంటలో వయ్యారిభామ, తుత్తురు బెండ లాంటి కలుపు మొక్కలు ఉంటే దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

#### నివారణ చర్యలు

- మొదటగా పొలంలో మరియు గట్ల వెంబడి వయ్యారిభామ, తుత్తురు బెండ లాంటి కలుపు మొక్కలను లేకుండా చూసుకోవాలి.
- పిండినల్లి ఆశించిన మొక్క భాగాలను త్రుంచి నాశనం చేయాలి.

- నివారణకు ప్రొఫెనోఫాస్ 3 మి.లీ. లేదా ఎసిఫేట్ 2 గ్రా. మరియు సాండోవిట్ లేదా ధనువిట్ లాంటి జిగురు మందులను 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్క పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

**తెల్లదోమ:**

- తెల్లదోమ పైరు పిందె, కాయ దశలలో ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది.
- తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన మొక్కలు గిడసబారి, పూ మొగ్గలు, పూలు, కాయలు రాలి, కాయలు పరిపక్వ దశకు రాకుండానే పగిలిపోతాయి.
- ఈ పురుగులు తేనెవంటి జిగట పదార్థాన్ని విసర్జించి ప్రత్తిని కలుషితం చేస్తాయి.



**నివారణ చర్యలు**

- నత్రజని ఎరువులను సిఫారసు మేరకే వాడాలి.
- పంట తొలిదశలో సింథటిక్ పైరిథ్రాయిడ్ మందులను విచ్చల విడిగా పిచికారి చేయకూడదు.
- ప్రత్తి పంటలో వయ్యారిభామ లాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- తెల్లదోమ ఆశించే ఏ పైరులోనైనా పసుపు రంగు డబ్బాలకు జిగురు పూసి పైరులో 10-15 వరకు లేదా మార్కెట్లో లభించే ఎల్లోస్టిక్ ట్రాప్స్ (ఎల్లోకార్డులు) ఎకరానికి 10 వరకు పెట్టుకోవాలి.
- లీటరు నీటికి పిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా డైఫెన్థయూరాన్ (పోలో) 1.25 గ్రా. కలిపి పిచికారి చేయాలి. వీలైనంత వరకు పై పురుగు మందులతో పాటు వేప సంబంధిత మందులను కలిపి పిచికారి చేసుకోవాలి.

**పచ్చదోమ**

- అధిక వర్షాలు, మబ్బులతో కూడిన వాతావరణ పరిస్థితులలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- పైరు లేత దశ నుండి పంట కాలం చివరి వరకు ఈ పురుగు ఆశిస్తుంది.
- పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు మొదట దోనెలుగా ముడుచుకొని, లేత పసుపు రంగులోకి మారి ఆ తర్వాత ఆకుల అంచుల నుండి ఎర్రబడి క్రమేపి ఎండి రాలి పోతాయి.



**నివారణ చర్యలు**

- నత్రజని ఎరువులను మోతాదుకు మించి వేయకూడదు.
- తొలిదశలో విచ్చలవిడిగా రసాయనిక మందులను పిచికారి చేయకుండా కాండానికి మందు పూసే పద్ధతిని పాటించాలి.

- లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

### గులాబిరంగు కాయ తొలుచు పురుగు

- ఈ సంవత్సరం గులాబిరంగు కాయ తొలుచు పురుగు పంట తొలి దశ (పూత దశ) నుండే ఆశించి నష్టపరుస్తున్నట్లు గమనించడం జరిగింది. అయితే ముందు జాగ్రత్తగా ఈ పురుగు వల్ల అధిక నష్టం జరుగక ముందే ఈ క్రింది సూచనలు పాటించినట్లయితే తొలి దశలోనే పురుగును గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే పురుగు వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చును.



- ప్రత్తి పంట ప్రస్తుతం పూత దశలో ఉంది కావున పురుగు పై నిఘా ఉంచడానికి ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి.
- ఈ బుట్టలలో వరుసగా మూడు రోజులు 8 తల్లి రెక్కల పురుగులు పడటం గమనించినట్లయితే వెంటనే 5% వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పి.పి.యం) 5 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని ఉదయం 8-11 గంటల సమయం లేదా సాయంత్రం 4-6 గంటల సమయంలో పిచికారి చేసుకోవాలి.
- పురుగు ఉధృతిని గమనించినట్లయితే లీటరు నీటికి 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 2.5 మి.లీ. ల క్లోరోపైరిఫాస్‌ను పిచికారి చేసుకోవాలి.
- పొలంలో గుడ్డి పూలను ఎప్పటికప్పుడు ఏరి నాశనం చేయాలి.
- లింగాకర్షక బుట్టలోని ఎరను ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చుకోవాలి.
- పొలం చుట్టూ తుత్తురు బెండ లాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- పురుగు ఉధృతిని బట్టి సింథటిక్ పైరిథ్రాయిడ్ లాంటి మందులను అక్టోబర్ మాసం తర్వాత 1 లేదా 2 సార్లు పిచికారి చేసుకోవాలి. తొలి దశలో వీటిని పిచికారి చేసినట్లయితే, తెల్లదోమ ఉధృతి పెరిగే అవకాశమున్నది.

### పెంకు పురుగు (చాఫర్ బీటిల్)

- ఈ పెంకు పురుగులు పువ్వులను ఆశించి పుప్పొడిని తినివేస్తాయి.
- లేత కాయలను ఆశించి నాశనము చేస్తాయి.
- వీటి నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా లాబ్డాసైహాలోత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.



ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9963073087



# చెఱకు తోటల్లో జడచుట్ల వలన కలిగే ప్రయోజనాలు

డా॥ యం. విజయ్ కుమార్, డా॥ జి. యస్. మధు బిందు మరియు డా॥ బి. సుప్రకాష్ కుమార్
వ్యవసాయ పరిశోధన స్థానం, బసంతపూర్, మామిడ్గి, న్యాల్‌కల్, సంగారెడ్డి జిల్లా

మన రాష్ట్రంలో చెఱకు ప్రధానమైన వాణిజ్య పంట. ఏటా 50 వేల హెక్టార్లు సాగు చేస్తూ, 11 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర వివిధ కర్మాగారాలలో ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ప్రధానంగా వర్షాకాలంలో వచ్చే అధిక వర్షాలు, బలమైన గాలుల వలన చెఱకు తోటలు పడిపోయి దిగుబడి మరియు రసనాణ్యతలో తరుగుదల ఏర్పడుతుంది. ఈ పడిపోయిన చెఱకు తోటల నుండి తయారైన బెల్లం నిల్వకు పనికిరాకుండా పోయి మార్కెట్‌లో సరైన ధర రాక రైతాంగం ఎంతో నష్టపోతున్నారు. అంతేకాకుండా పడిపోయిన చెఱకు తోటను ఇతర జంతువులు ఆశ్రయంగా మార్చుకొని తోటను నాశనం చేస్తాయి. అందుకని ఏపుగా పెరిగే సమయంలో చెఱకు తోటలను జడచుట్టినట్లయితే ఎలాంటి నష్టం జరగకుండా నివారించుకోవచ్చును.

చెఱకు పంటకాలము మరియు ఎదుగుదలను బట్టి 2-3 సార్లు జడచుట్టు వేసుకుంటే తోట పడిపోకుండా నివారించుకోవచ్చు. అయితే మొదటి జడచుట్టు చెఱకు సుమారు 1.5 మీటర్లు ఎత్తు ఎదిగిన తరువాత వేసుకోవాలి. తోట పెరుగుదలను బట్టి డిసెంబర్ మాసంలో నాటిన చెఱకు తోటలకు మొదటి జడచుట్టు ఆగష్టు మొదటి వారంలోను, రెండవ జడచుట్టు సెప్టెంబరు మొదటి వారంలోను మరియు ఎదుగుదలను బట్టి ఆఖరు జడచుట్టు సెప్టెంబరు చివరిలో వేసుకోవాలి. జడచుట్టు అందరూ వేయలేరు. మంచి అనుభవం ఉన్న వారు వేస్తే గట్టిదనం మరియు పడిపోకుండా వుండి జడ అల్లిక కూడా క్రమబద్ధంగా వుండి, చూడడానికి కూడా కంటికి ఇంపుగా కనిపిస్తాయి. నిజామాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దగ్గరగా వున్న నాలుగైదు దుబ్బులను మెలివేసి జడ చుట్టుతుంటారు. కాని ఇలా చేయడం వలన తోటకు ప్రయోజనం చేకూరదు. అయితే జడచుట్లు వేసుకునేటప్పుడు, అడుగు భాగాన మరియు ప్రక్కన వున్న ఆకులను మెలివేసి 5 సెం.మీ. వ్యాసం గల గడలకు వరుస పొడవున జడచుట్లు వేసుకోవాలి. దీని వలన మొక్కకు సూర్యరశ్మి బాగా అందుతుంది. చెఱకు మొక్కకు గల వృక్ష ధర్మ స్వరూపాన్ని బట్టి సూర్యరశ్మిని ఉపయోగించుకునే సామర్థ్యం ఇతర పంటలైన వరి, గోధుమ, పప్పుధాన్యముల కంటే రెండున్నర రెట్లు ఎక్కువగా ఉంటుంది. అందుకని చాళ్ళలో గల గడలను వరుసగా కలిపి జడచుట్లు వేసుకున్నట్లయితే మొక్కలకు చేకూరే లాభం ఎక్కువ ఉంటుంది.

ఇతర పంటల వలె చెఱకు తోట దిగుబడులు కూడా ఆకుల విస్తీర్ణంపై ఆధారపడి ఉంటుంది. సామాన్యంగా ఆకుల విస్తీర్ణం ఒక చ.మీ. గల భూమిపై, పంటను బట్టి 4 నుండి 9 ఆకులు వుంటే మంచి దిగుబడులు వస్తాయి. ఇక చెఱకు పంట విషయానికొస్తే పంట వయస్సు పెరిగే కొద్దీ ఈ ఆకుల విస్తీర్ణం కూడా పెరుగుతుంది. ఆకుల విస్తీర్ణం సూచిక 180 రోజుల వయస్సులో హెచ్చుగా ఉంటుంది. ఆ తర్వాత పక్వదశలో ఆకుల విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతుంది. ఈ తరుగుదల ఆకులు ఎండిపోవుట వలన మరియు క్రొత్త ఆకులు తొడగక పోవుట వలన ఏర్పడుతుంది. ఈ తరుగుదల ఆకుల విస్తీర్ణ సూచిక మరీ హెచ్చుగా ఉంటే పై ఆకుల వల్ల క్రింది ఆకులకు నీడ వచ్చి, క్రింది ఆకుల కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం తగ్గిపోతుంది. కాబట్టి క్రింది ఆకులను రెలచుట మొక్కలకు లాభదాయకం అయితే

కొంత మంది రైతులు ఎండి ఎండని ఆకులను తీసివేసి 3 లేక 4 పచ్చని ఆకులను మాత్రమే ఉంచి మిగిలినవి జడ కట్టుతుంటారు. కాబట్టి ఆకులు రెల్చునప్పుడు లేక జడకట్టేటప్పుడు చెఱకుకు కనీసం ఎన్ని ఆకులు వుంచవలెనో నిర్ణయించుట కొరకు వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్‌లో పరిశోధనలు జరిగినవి. ఈ పరిశోధనల్లో సన్నని ఆకులు గల చెఱకు రకాలు కో 6907 మరియు కో ఎ 97ఆర్401లకు ఆరు మరియు ఎనిమిది పూర్తిగా రూపొందని పచ్చని ఆకులను మాత్రమే ఉంచి మిగిలిన వాటిని రెల్చి వేసి, తోట 120 మరియు 240 రోజుల వయస్సు (తోట ఏపుగా పెరిగే దశ) ఉన్నప్పుడు పరిశీలించగా గడపై ఎనిమిది బాగా రూపొందిన పచ్చని ఆకులు వున్న చెఱకు నుంచి మంచి దిగుబడులు నమోదు చేయడం జరిగింది. అందుకని రైతాంగం జడచుట్టునప్పుడు చెఱకు మొక్కపై కనీసం ఎనిమిది పూర్తిగా రూపొందిన పచ్చని ఆకులు ఉండునట్లు జాగ్రత్తపడితే లాభదాయకంగా ఉంటుంది.

ఆగష్టు, సెప్టెంబరు మాసంలో చెఱకు పంటను ఆశించే రసం పీల్చుపురుగులు, తెల్లనల్లి, తెల్ల పేను (ఊలి ఎఫిడ్), దూదేకుల పురుగు (పైరిల్లా), పిండి నల్లి, పొలుసు పురుగు మరియు పసుపు నల్లి ఉధృతి తక్కువగా ఉండడానికి తప్పనిసరిగా పై 8 ఆకులు వదిలి, పురుగులు ఆశించిన ఆకులను రెలచి వేయడం లేక జడ చుట్టుకోవడం వలన ఈ పురుగు ఉధృతి తగ్గుతుంది. అంతేకాకుండా పిండినల్లి, పొలుసు పురుగు ఎండకు, గాలికి బహిర్గతం కావటం వలన వాటి ఉధృతి కొంత వరకు తగ్గుతుంది. ఈ జడచుట్లు వేయటం వలన గాలి, వెలుతురు తగిలి రసంపీల్చు పురుగులు ఆశించే స్థాయి తగ్గటమే కాకుండా, పురుగు మందుల పిచికారి చేపట్టడం సులభతరం అవుతుంది.

కొన్ని సందర్భాలలో రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడుతుంటారు. అలాంటి తోటలు ఏపుగా పెరిగి పడిపోయి త్రుప్పు తెగులు, దూదేకుల పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అందుకని మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషక పదార్థాలను సమానంగా అందించి జడచుట్లు వేసుకొన్నట్లయితే తోటల దిగుబడి పెరగటమే కాకుండా నాణ్యత కూడా పెరుగుతుంది. ఏపుగా పెరిగిన చెఱకు తోటలకు జడచుట్లతో పాటు అక్కడక్కడ వెదురు గడలను భూమిలో నిలబెట్టుకోవడం కూడ ప్రయోజనకరమే. అదేవిధంగా జడచుట్టు సమయంలో చెఱకు దుబ్బుల మొదళ్ళ వరకు మట్టిని ఎగద్రోసినట్లయితే చెఱకు గడలకు బలం చేకూరి, తోటలు పడకుండా వుండటానికి ఆస్కారముంటుంది. అందుకని రైతాంగం భూసారాన్ని బట్టి సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి, సకాలంలో చెఱకులో జడచుట్టు వేసుకున్నట్లయితే అధిక దిగుబడి పొంది నాణ్యమైన చక్కెర ఉత్పత్తి చేసుకోవడానికి ఆస్కారముంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849535756**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి విద్యార్థుల రేడియో కార్యక్రమము "చేను కబుర్లు" ప్రతి బుధవారం మధ్యాహ్నం 1.30 నుండి 2.00 గంటలకు ఆకాశవాణి హైదరాబాద్ 'ఏ' కేంద్రం ద్వారా ప్రసారమవుతుంది. ఇందులో వ్యవసాయ, గృహ విజ్ఞాన మరియు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారాన్ని నాటిక, పాటలు, రైతు సదస్సు, చర్చాగోష్ఠులు, శాస్త్రవేత్తలతో ఇంటర్వ్యూ మొదలగు పద్ధతుల ద్వారా తెలియజేస్తున్నారు. కావున తెలంగాణ రైతన్నలారా ఈ రేడియో కార్యక్రమాన్ని తప్పక వినియోగించుకొని విద్యార్థులను ప్రోత్సహించండి.

గమనిక: పరిష్కారం కాల్ సెంటర్
తెలంగాణ రాష్ట్రం కొరకు అయితే
మొబైల్ ద్వారా 1800 425 1110
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొరకు అయితే
మొబైల్ ద్వారా 1800 425 4440 నంబర్లను
ఉదయం 10 గం॥ నుండి సాయంత్రం 5 గం॥ వరకు సంప్రదించగలరు.
వ్యవసాయ వెబ్‌సైట్ తెలంగాణ కొరకు అయితే
agrisnet.tg.nic.in
ఆంధ్రప్రదేశ్ కొరకు అయితే apagrisnet.gov.in
కిసాన్ కాల్ సెంటర్ : 1551

# సోయాచిక్కుడులో తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ శ్రీధర్ చౌహాన్, కె. రాజశేఖర్ మరియు డా॥ రాజేందర్ రెడ్డి
వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్

తెలంగాణ ప్రాంతంలో సోయాచిక్కుడు ఖరీఫ్ పంట కాలంలో సాగు చేసుకునే ముఖ్యమైన నూనె గింజ మరియు పప్పు దినుసుల పంట. ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్ మరియు వరంగల్ జిల్లాల్లో సుమారుగా 3 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో, 25 లక్షల టన్నుల ఉత్పత్తి మరియు ఎకరానికి ఇంచుమించు 1000 కిలోల దిగుబడి సామర్థ్యంతో సాగుచేయబడుతున్నది. సోయా నూనెలో (20-23%) ఎక్కువ శాతం అసంతృప్త క్రొవ్వు ఆమ్లాలే ఉండడం వలన మనం వాడే నూనెలన్నింటి కన్నా ఇది ఆరోగ్యానికి మంచిది. సోయాలో లభించే మాంసకృత్తులు (40-45%) జంతు సంబంధమైన మాంసకృత్తులతో సమానమైన పోషక విలువ కలవి. ఇనుము, ఫోలిక్ ఆమ్లం అధిక శాతంలో ఉండుట వలన స్త్రీలలో అధికంగా కనిపించే రక్తహీనతను నివారించడానికి సోయా చిక్కుడు వాడకం ఎంతగానో తోడ్పడుతుంది.

## ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలను బట్టి ఎరువుల మోతాదును వినియోగించాలి. సిఫారసు చేసిన నత్రజని ఎరువులలో 50% నత్రజని అనగా 25-30 కిలోల యూరియాను పైపాటుగా కాయలు ఏర్పడు/అభివృద్ధి చెందే దశలో అనగా 45-50 రోజుల సమయంలో వేసి మట్టితో కప్పాలి. జింకు ధాతు లోప లక్షణాలు కనపడినచో లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయలి. కాయలు ఏర్పడు సమయంలో 2 శాతం యూరియాను లేదా 2% డిఎపి లేదా 2% పొటాషియం నైట్రేట్ (13-0-45) లేదా 19-19-19 (పాలీఫీడ్) లాంటి నీటిలో కరిగే ఎరువులను 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే అధిక విత్తన దిగుబడిని పొందవచ్చును.

## నీటియాజమాన్యం

సోయాచిక్కుడు ప్రధానంగా వర్షాధారపు పంట. సుమారుగా 350-400 మి.మీ.ల నీటి అవసరం ఉంటుంది. బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు నీటి సౌలభ్యత ఉన్నచోట కాయ దశలో నీటి తడులు ఇచ్చి అధిక దిగబడులను సాధించవచ్చు. పుష్పించు దశ నుండి గింజ అభివృద్ధి చెందే దశ (45-75 రోజుల మధ్య) తేమ సున్నిత దశ. ఈ సమయంలో నీటి ఎద్దడి ఏర్పడినచో నేల గుణాన్ని బట్టి 1-2 నీటి తడుల అవసరం ఉంటుంది.

## సస్యరక్షణ చర్యలు

### పురుగులు

#### రసంపీల్చే పురుగులు (తెల్లదోమ/పచ్చదోమ)

ఆకుల్లోని రసం పీల్చడం వలన ఆకులు పసుపు మరియు గోధుమ రంగులోకి మారి దిగుబడులు తగ్గుతాయి. తామర పురుగుల ద్వారా మొవ్వుకుళ్ళు మరియు తెల్లదోమ ద్వారా మొజాయిక్ తెగులు వ్యాపిస్తుంది. వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. ఎకరానికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.25 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

#### కాండం తొలిచే ఈగ

లేటుగా విత్తిన పొలంలో దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు లేత ఆకులపై చిన్న గుంటలు చేసి గ్రుడ్లను పెడతాయి. గ్రుడ్ల నుండి వెలువడిన లార్వాలు కాండంలోనికి చేరి తినడం వలన మొక్కలు వడలి సమూలంగా నాశనమవుతాయి. ఈగ సోకిన మొక్కలను మొదట్లోనే సునిశితంగా గమనించినట్లయితే కాండంపై గుండ్రని రంధ్రం కనిపించి దానిచుట్టూ ఎర్రని పదార్థం



కనిపిస్తుంది. దీనిని గమనించినట్లయితే వెంటనే ఎసిఫేట్ 1.5 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.35 మి.లీ.+డిడివిపి/డైక్లోరోవాస్ 1 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ./లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఫోరేట్ 10జి గుళికలను ఎకరానికి 4 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 10 కిలోలు వాడుకోవచ్చు.

## పెంకు పురుగు

ఈ పురుగు కాండం మీద అర్ధచంద్రాకారంలో రంధ్రం చేసి లోపలికి పోయి ప్రధాన కాండమును, ప్రక్క కొమ్మల లోపలి పదార్ధమును తినుట వలన కొమ్మల చివరి భాగము ఎండిపోవును. ఈ పురుగు ఆశించినప్పుడు కాండం మరియు ఆకు కాడలపై కత్తితో రెండు గాట్లు పెట్టినట్లు కనిపిస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ.+డిడివిపి/డైక్లోరావాస్ 1 మి.లీ./లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.



## పొగాకు లద్దె పురుగు

ఈ పురుగులు ఆకులలోని పచ్చని పదార్ధాన్ని గీకి తినడం వలన ఆకులు జల్లెడగా మారతాయి. ఆకులకు రంధ్రాలు చేసి, ఆకులను పూర్తిగాను, పువ్వులను, కాయలను కూడా తింటుంది. నివారణకు పురుగు మొదటి రెండు దశలలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు తర్వాత దశల నివారణకై విషపు ఎర పద్ధతిని ఆచరించాలి.



చెత్త, చెదారం పొలం నుండి తీసివేయాలి. పురుగు ఉధృతిని బట్టి నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా./లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

## శనగపచ్చ పురుగు

ఈ పురుగు సోయాచిక్కుడు పంటను ఆగష్టు/ సెప్టెంబర్ మాసాలలో ఆశిస్తుంది. ఎదిగే లార్వాలు ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని, మొగ్గ ఏర్పడే దశలో మొగ్గలను, పూతను, కాయల్లోని లేత గింజలను తింటూ పంటకు నష్టం చేస్తాయి. ఈ పురుగుల నివారణకు పక్షి స్థావరాలను ఎకరానికి 20 చొప్పున లేదా లింగాకర్షక ఎరలు ఎకరానికి 4 చొప్పున 50 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి. క్వినాల్ఫాస్ 2.5 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి లేదా పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ./లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతిని బట్టి ఫ్లూబెండమైడ్ 0.2 గ్రా. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా క్లోరాంత్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.6 మి.లీ.(+) ఇండాక్సోకార్బ్ 1.6 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.35 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## తెగుళ్ళు

### మొవ్వుకుళ్ళు తెగులు

ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. తెగులు సోకిన లేత మొక్కల ఆకులు గిడస బారిపోతాయి. మొక్క మొవ్వు నుండి ఎండిపోతుంది. తామర పురుగుల నివారణకై విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. పైరుపై ఆశించినప్పుడు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ తెగుళ్ళ మందును (కార్బండాజిమ్/మాంకోజెబ్) పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకోవచ్చు.

### ఆంత్రక్నోస్ ఆకుమచ్చ/కాయకుళ్ళు తెగులు

మొదటి దశలో ఆకులపై, తదుపరి దశలో కాయలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 2 గ్రా. క్లోరోథలోనిల్ కలిపి 20 రోజుల వ్యవధిలో అవసరాన్ని, వ్యాధి తీవ్రతను బట్టి 2 సార్లు పిచికారి చేయాలి.



### ఎల్లో మొజాయిక్/పల్లాకు తెగులు

పంట పూత నుండి గింజ అభివృద్ధి చెందే దశలో తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాయల మీద పసుపుపచ్చ పొడ ఏర్పడి మొక్క పసుపు రంగులోకి మారుతుంది. తెగులు సోకిన మొక్కలను మొదట్లోనే గుర్తించి వాటిని పీకి నాశనం చేయాలి. నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా డైఫెన్ థయూరాన్ 1.25 గ్రా. ను కలిపి వారం వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేసి తెగులు వ్యాప్తి చేసే పురుగులను నివారించవచ్చు. పసుపుపచ్చ జిగురు డబ్బాలను ఎకరానికి 8-10 అమర్చి తెల్లదోమల వ్యాప్తిని అరికట్టవచ్చు.



### కుంకుమ తెగులు

ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తెగులు తీవ్ర దశలో త్రుప్పు రంగు పొడ ఏర్పడుతుంది. నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేక 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి వారం వ్యవధిలో అవసరాన్ని బట్టి 2-3 సార్లు పిచికారి చేయాలి.

### పంట కోత మరియు కోతానంతర జాగ్రత్తలు

పంట పూర్తి కాలం తర్వాత లేదా మొక్కల పైన మూడో వంతు కాయలు ఎండిన తర్వాత పంటను కోసి, నూర్పిడి చేసి 9-10% తేమ వచ్చు వరకు బాగా ఆరబెట్టి గింజలను పాలీ బ్యాగు (హెచ్‌డిపి సంచులలో) నిల్వ చేసుకోవాలి.

### ఉత్పత్తులకు విలువ జోడింపు

నూనె తీసిన సోయా పంటలో 55-60% మాంసకృత్తులు ఉంటాయి. దీనికి విదేశాలలో మంచి గిరాకీ ఉంది. దీనిని గోధుమ, శనగ పిండితో కలిపి వాటి నాణ్యతను పెంచవచ్చు. సోయా గింజలు వివిధ ఉత్పత్తుల (పాల సంబంధిత ఉత్పత్తులు, బేకరి పదార్థాలు, మందులు, రంగులు, ఆయిల్స్ మొ॥వి) తయారీలో ఉపయోగపడతాయి.

### సోయాచిక్కుడు విత్తనోత్పత్తిలో ప్రస్తుతం తీసుకోవలసిన జాగ్రత్తలు

స్వపరాగ సంపర్కానికి చెందిన సోయాచిక్కుడు పుష్పాలు తెలుపు, ఊదా రంగు లేదా లేత గులాబి రంగులో ఉంటాయి. ఫలదీకరణానికి 24 గంటల ముందు మరియు 48 గంటల తర్వాత వరకు కీలాగ్రానికి పరాగ రేణువులను స్వీకరించే శక్తి కలిగి ఉంటుంది. కావున సోయాలో సాధారణంగా స్వపరాగ సంపర్కమే జరుగుతుంది. కీటకాల ద్వారా కేవలం 1 శాతం వరకు పరపరాగ సపర్కం జరుగవచ్చు.

## సోయాచిక్కుడు విత్తనోత్పత్తిలో తీసుకోవలసిన జాగ్రత్తలు

1. విత్తనోత్పత్తిలో అధిక జన్యు స్వచ్ఛత కలిగిన నాణ్యమైన విత్తనాలను పొందడానికి వివిధ దశలలో బెరుకులను ఏరివేయాలి. కాండం ఊదా రంగులో ఉన్నదా లేదా చూసుకోవడం ద్వారా పైరు తొలిదశలో (7-10 రోజులు) బెరుకులను గుర్తించవచ్చు. మొక్క ఎత్తు, ఆకు రంగు, ఆకు ఆకారము, పూల రంగు (తెలుపు/ఊదా రంగు), పూత పూసే సమయం, కాండం మరియు కాయలపై నూగు ఉన్నదీ, లేనిదీ గమనించడం ద్వారా కూడా బెరుకులను గుర్తించవచ్చు. దీనితో పాటు నూగు బంగారు వర్ణంలో ఉన్నదా లేదా బూడిద రంగులో ఉన్నదో కూడా గమనించాలి. చివరగా పక్వానికి వచ్చినప్పుడు కాయలు నలుపు రంగులోకి మారుతున్నాయా లేదో తెలుసుకోవడం మరియు కాయలో గింజల సంఖ్య 2-3 గ్రా. లేదా 3-4 గ్రా. ఉన్నాయో గమనించి బెరుకులను సమర్ధవంతంగా ఏరివేయాలి. ప్రధానంగా బెరుకులను పూత మరియు కాయ పక్వ దశలో సులువుగా గుర్తించడం జరుగుతుంది. కాబట్టి ఈ దశలలో బెరుకులను ఏరివేసి జన్యు స్వచ్ఛతను కాపాడుకోవాలి.
2. వివిధ విత్తన రకాల మధ్య కనీసం 3 మీ. అంతర దూరం పాటించడం ద్వారా జన్యు స్వచ్ఛతను కాపాడుకోవచ్చు.
3. పైరు సునిశిత దశలలో (పూత-కోత దశలు) బెట్ట పరిస్థితులు నెలకొన్నట్లయితే నీటి తడులు అందించడం మరియు 2% యూరియాను ఈ దశలలో పిచికారి చేయడం ద్వారా విత్తన నాణ్యతను కాపాడుకోవచ్చు.
4. అలాగే తెగుళ్ళు మరియు చీడపీడల బారి నుండి పంటను రక్షించి అధిక దిగుబడిని పొందడానికి సరైన సమయంలో సరైన మందులను పిచికారి చేయాలి.

## విత్తన కోత, నూర్పిడి మరియు నిల్వలో పాటించవలసిన జాగ్రత్తలు

- ఆకులు పసుపు పచ్చగా మారి పూర్తిగా ఎండి రాలిపోయే ప్రారంభ దశలో మరియు కాయలు పూర్తిగా ఎండక మునుపే పంటను జాగ్రత్తగా కోసినట్లయితే నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చును.
- గింజ గట్టిపడిన వెంటనే లేదా కాయ రంగు ఆకుపచ్చ నుండి బంగారు వర్ణంలోకి మారిన వెంటనే కోత కోయాలి.
- సాధ్యమైనంత వరకు పంటను చేతితో కోయాలి. విత్తనోత్పత్తిలో యంత్రాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి.
- తడి వాతావరణంలో పంటను కోయరాదు. వర్షం పడే సమయంలో కోసిన యెడల చీడపీడలు ఆశిస్తాయి.
- నూర్పిడి యంత్రాలను తక్కువ వేగంతో 300-400 ఆర్.పి.యంతో త్రిప్పడం ద్వారా విత్తన కవచం దెబ్బతినకుండా చేసుకోవచ్చు.
- పంటను నూర్చే సమయంలో విత్తన కవచం( విత్తన పొర) దెబ్బతినకుండా కర్రలతో నూర్చాలి.
- కోత సమయంలో విత్తన తేమ శాతం 14-16 కంటే ఎక్కువ ఉండరాదు.
- కోత తర్వాత విత్తనాలను గాని, విత్తన సంచులను గాని ఐదు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు నుండి క్రింద పడకుండా జాగ్రత్త పడాలి.
- విత్తనం ఎండబెట్టే సమయంలో నేరుగా సూర్యరశ్మి తగలకుండా జాగ్రత్త పడాలి.
- విత్తన తేమ శాతం 12 కన్నా తక్కువగా తగ్గే వరకు పలుచని పొరలో ఎండబెట్టుకొని కొత్త సంచులలో నిల్వ చేసుకోవాలి.
- విత్తనము నిల్వ చేయు గోదాములు భూమి నుండి కనీసం ఒక మీటరు ఎత్తులో ఉండి కేవలం ఒకే ఒక్క ద్వారంను కలిగి ఉండాలి.
- విత్తనాలను గోదాము లోపల నేలపై కాకుండా బల్లలపై 4-6 వరుసలకు మించకుండా క్రొత్త సంచుల్లో నిల్వ ఉంచాలి.
- కీటకాల బారి నుండి విత్తనాలను రక్షించేందుకు అల్యూమినియం ఫాస్పైడ్ (సల్ఫస్) టాబ్లెట్లతో ప్రతి టన్నుకు 3.0 గ్రా. చొప్పున 3-5 రోజుల పాటు పొగబారించాలి.
- విత్తన తేమ శాతము 14-14.3% ఉండి, ఉష్ణోగ్రతలు $30^0$ సెల్సియస్ ఉన్నట్లయితే శిలీంధ్రాల వలన 6 నెలలలో గింజ నాణ్యత దెబ్బతింటుంది. అధిక ఉష్ణోగ్రతల వద్ద శిలీంధ్రాల శ్వాస క్రియ జరిగి విత్తనాలు రంగు మారి, నాణ్యతపై ప్రభావం చూపిస్తాయి. కావున 15 రోజులకు ఒకసారి చొప్పున కొత్త విత్తన నమూనాలను సేకరించి, నాణ్యతను నిర్ధారించుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9441167821



# వర్షాధార వ్యవసాయంలో నీటి కుంటలు - ప్రాముఖ్యత

డా|| టి.టి. రాంమాంజనేయులు, డా|| ఎం. వెంకట రమణ, కె. శ్రీనివాస్ కుమార్,
డా|| టి. రాములు మరియు డా|| కె. ఎస్. రెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

భారతదేశంలో శుష్క మరియు అర్ధ శుష్క ప్రాంతాలలో భూమి మీద లభ్యమయ్యే నీటికి వర్షపు నీరే ముఖ్య ఆధారం. దేశంలో దాదాపు 55% వరకు నికర విస్తీర్ణం వర్షాధారంగా సాగవుతున్నది. అయితే ఒక వైపు ఋతుపవనాల ఆగమనం ఆలస్యమవటం, పంట మధ్య లేక చివరి దశలలో వర్షాలు సరిగా రాకపోవటం, ఎలినినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదవటం జరుగుతున్నది. మరో వైపు జనాభ పెరుగుదల, వివిధ పరిశ్రమలలో నీటికి పెరుగుతున్న గిరాకి, వాతావరణ కాలుష్యం లాంటి సమస్యలు ప్రస్తుతం ఉన్న నీటి వనరుల పై తీవ్రప్రభావం చూపుతున్నాయి.

ప్రస్తుతం దేశంలో ఉన్న నీటి వనరులలో 84% వ్యవసాయ రంగంలో వినియోగించబడుతున్నది. అయితే, 2025 వ సంవత్సరాని కల్లా, వ్యవసాయ రంగానికి లభ్యమయ్యే నీరు 70% కు చేరుకోనున్నది. కాబట్టి వర్షపు నీటిని కూడా సమర్ధవంతంగా సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉంది.

మెట్ట ప్రాంతాలలో సరైన సమయంలో వర్షాలు కురవక పోవటం వలన బెట్ట పరిస్థితులు ఏర్పడి పంటలు దెబ్బతినడం వలన రైతులు నష్టపోతున్నారు. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ వర్షాలు లేక తుఫాను ప్రభావం వలన ఎడతెరపి లేకుండా వర్షాలు పడినపుడు వర్షాపు నీరు వరద రూపంలో బయటికి ప్రవహిస్తుంది. దీని వలన పరివాహక ప్రాంతంలో నీటి ఎద్దడి మరియు లోతట్టు ప్రాంతాలలో పంట భూములు ముంపునకు గురవుతాయి. అందువలన వర్షం ద్వారా సంభవించే వరద నీటిని రైతులు తమ పొలంలో నీటి కుంటలు నిర్మించుకొని నిల్వ చేసుకున్నట్లయితే, వర్షాభావ పరిస్థితులలో ఈ నీటిని ఉపయోగించి 1-2 తడులు ఇచ్చి పంటలను బెట్ట నుండి కాపాడుకోవచ్చును.

**నీటి కుంటలు :** వ్యవసాయ భూముల నుండి పారే వరద నీటిని సేకరించి పంటల సంరక్షణకు వాడుకొనుటకు సరైన ఆకారం మరియు పరిమాణంలో త్రవ్విన గుంతలను "నీటి కుంటలు లేక "పంట సంజీవని" అంటారు.

**నీటి కుంటలు నిండుటకు అవకాశాలు :** సరాసరి సాలీన వర్షపాతం 500-750 మి.మీ కురిసే ప్రాంతాలలో 250-500 క్యూ.మీ. సామర్థ్యం ఉన్న నీటి కుంటలను నిర్మించుకోవచ్చు. 750 మి.మీ కంటే ఎక్కువగా కురిసే ప్రాంతాలలో 500 క్యూ.మీ. కంటే ఎక్కువగా సామర్థ్యం ఉన్న నీటి కుంటలను నిర్మించుకోవాలి.

స్థూలంగా పరిశీలిస్తే, నీటి కుంటలు రెండు సందర్భాలలో నిండుటకు అవకాశముంది. మొదటిది తక్కువ సమయంలో అధిక వర్షం కురవడం (5 సెం.మీ.). ఇటువంటి సందర్భాలు ఏప్రిల్, మే-జూన్ మరియు ఆగష్టు మాసాలలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెంలో నమోదైనవి. రెండవది-తుఫాను ప్రభావం వలన ఎడ తెరపి లేకుండా వర్షం కురవడం, ఇలాంటి సందర్భాలు సాధారణంగా సెప్టెంబరు మరియు అక్టోబర్ మాసాలలో నమోదవుతాయి.

ఖరీఫ్ సీజన్ ప్రారంభంకల్లా నీటి కుంటలు నిండితే పంట తొలిదశలో వర్షాలు సరిగా రానప్పుడు సరైన సమయానికి విత్తనాలు విత్తుటకు మరియు పంట మధ్య లేక చివరి దశలలో బెట్ట పరిస్థితులు సంభవించినప్పుడు జీవ తడులు ఇచ్చి పంటను సంరక్షించుటకు ఈ నీటిని వినియోగించుకోవచ్చు. ఒకవేళ వర్షాకాలం చివరలో నీటి కుంటలు నిండి, పంటలకు వర్షాభావ పరిస్థితులు సంభవించకపోతే, అట్టి నీటిని రబీ (యాసంగి)లో పంటలు పండించుటకు వాడుకోవచ్చును.

**నీటి కుంటల నిర్మాణం :** నీటి కుంటల నిర్మాణం చేపట్టవలసిన స్థలంలో చెట్లు, చేమలను తొలగించి, కుంట త్రవ్వవలసిన ప్రాంతం మరియు తోడిన మట్టిని కట్టలుగా వేయవలసిన ప్రాంతాలను కర్ర/ఇనుప కొయ్యల ద్వారా గుర్తుగా పెట్టవలెను. జె.సి.బి. సహాయంతో కుంట త్రవ్వడం పూర్తయిన తర్వాత, కుంట అడుగు భాగం, ప్రక్కలు మరియు పైకట్టలను చెక్క దిమ్మెతో బాగా గట్టిపడేటట్లు చేయుట ద్వారా అనుకున్న ఆకారంలో నీటికుంటలను నిర్మించుకోవచ్చు.

నీటి కుంటలను వివిధ ఆకారాలలో నిర్మించుకోవచ్చు. 1. చతురస్రాకారం 2. దీర్ఘచతురస్రాకారం 3. తల క్రిందులైన శంఖాకారం. 4. ట్రెపీజియం. అయితే చతురస్రాకారం లేక ట్రెపీజియం ఆకారంలో నీటి కుంటలను నిర్మించడం మంచిది.

ఒక హెక్టారు పరివాహక ప్రాంతం ఉన్నప్పుడు, 250 క్యూ.మీ. సామర్థ్యం ఉన్న నీటి కుంటను నిర్మించాలి. తక్కువ పరివాహక ప్రాంతం ఉంటే నీటి కుంటలు నిండవు. అలాగే ఎక్కువ పరివాహక ప్రాంతం ఉంటే యాజమాన్యం కష్టతరమవుతుంది.

నీటి కుంటల లోతు 2.5-3.5 మీ॥ కంటే ఎక్కువగా ఉండరాదు. ఎక్కువైతే, నీటిని పైకి తోడి వాడుటకు అయ్యే శక్తి మరియు ఖర్చు ఎక్కువ అవుతుంది. ప్రక్క ఏటవాలు 1:5:1 నిష్పత్తిలో ఉండే విధంగా నీటి కుంటలను నిర్మించాలి. అయితే వివిధ నేలల్లో అనగా బంక మట్టి నేలల్లో 1:1-2:1, బంక మట్టితో కూడిన లోమ్ నేలల్లో 1.5 : 1-2:1, ఇసుకతో కూడిన లోమ్ నేలల్లో 2:1-2.5:1, ఇసుక నేలల్లో 3:1 ఉండే విధంగా చూసుకోవాలి.

నీటి కుంటలను అన్ని రకాల నేలల్లో త్రవ్వుకోవచ్చు. కానీ నల్ల రేగడి నేలల్లో నీరు భూమిలోకి ఇంకే సామర్థ్యం తక్కువ (0.5-0.8 సెం॥మీ॥/గంటకు) కాబట్టి, ఈ నేలలు నీటి కుంటల నిర్మాణానికి బాగా అనుకూలం. ఆ తర్వాత, ఎర్ర నేలలు అనుకూలం.

**నీటి కుంటలకు పూత పూయుట :** నీటి కుంటలలో చేరిన వర్షపు నీరు వివిధ రూపాలలో అనగా భాష్పీభవనం ద్వారా వాతావరణంలోకి మరియు సీపేజ్ ద్వారా భూమి లోపల పొరలలోకి వెళ్తుంది. దీని వలన పంట రక్షించుటకు వినియోగపడే నీటి లభ్యత తగ్గిపోతుంది. కాబట్టి నీటి కుంటలకు లైనింగ్ చేయాలి. వివిధ రకాల పదార్థాలను పూత పూయుటకు వాడవచ్చు అనగా : సిమెంట్ కాంక్రీటు, ఇటుక సిమెంట్, బంక మట్టి, సిల్‌పాలీన్ షీటు లేక ఎల్.డి.పి.ఇ లేక హెచ్.డి.పి.ఇ షీటు ఎర్రమట్టి+సిమెంట్ (6:1) లేక మట్టి+ ఆవుపేడ+చొప్ప (7:2:1).

పైన పెర్కొన్న అన్నింటిలో 500 మైక్రాన్‌ల మందం కలిగిన హెచ్.డి.పి.ఇ పాలిథీన్ షీటు లేక 300-350 జి.ఎస్.ఎమ్. సిల్‌పాలీన్ షీటులను ఉపయోగించి లైనింగ్ చేయడం ఉత్తమం.

లైనింగ్ చేయడం వలన నీటి కుంట అడుగు భాగం నుండి భూమిలో మరియు ప్రక్క గోడల వెంబడి నీటి వృధా 95% వరకు తగ్గుతుంది. దీని వలన నీరు ఎక్కువ రోజులు నిల్వ వుండి పంట మరియు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుంది. నల్లరేగడి భూముల్లో నీరు భూమిలోకి ఇంకే గుణం తక్కువ కాబట్టి, అట్టి పొలాల్లో నిర్మించిన నీటి కుంటలలో లైనింగ్ లేకపోయిన, నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. కానీ ఎర్ర నేలలు లేక తేలిక పాటి నేలల్లో నీరు ఎక్కువగా ఇంకిపోతుంది. కాబట్టి లైనింగ్ చేసి నీటి వృధాను అరికట్టాలి. కుంటల నుండి భాష్పీభవనం రూపంలో పోయే నీటి వృధాను తగ్గించుటకు వేప నూనె (5 మి.లీ/ల) లేక కెయోలిన్ (50 గ్రా.లీ) లను పిచికారి చేయాలి.

**నీటి కుంటల నిర్వహణ :**

1. పరివాహక ప్రాంతంలో ఉన్న మట్టి దాదాపు సం॥రానికి 4.0-6.0 టన్నులు/హె. వర్షపు నీటితో పాటు వచ్చి నీటి కుంటలలో చేరుతుంది. ఇది నీటి కుంటలో నీటిని నిల్వ చేసే సామర్థ్యం మరియు జీవితాకాలాన్ని తగ్గిస్తుంది. క్రింది పద్ధతుల ద్వారా ఒండ్రుమట్టిని తగ్గించి నీటి కుంట నిల్వ సామర్థ్యం పెంచుకోవచ్చు.
   - పరివాహక ప్రాంతంలో పంటలు వేసినప్పుడు కాలువలు మరియు బోదెల పద్ధతిని అనుసరించాలి. వీలైతే మల్చింగ్ చేయాలి.
   - నీటి కుంటల పై భాగాన ఒండ్రుమట్టి సేకరణ గుంతలు ఏర్పాటు చేయాలి.
   - పిల్లకాలువల ద్వారా వచ్చి చేరే చెత్త మరియు చెదారాన్ని ఎప్పటికప్పుడు తీసి కాలువలకు దూరంగా పడేయాలి.
   - నీటి కుంటలను మరియు ఒండ్రు మట్టి సేకరణ గుంతలను 3-5 సం॥ కొకసారి శుభ్రపరచి, ఆ మట్టిని తిరిగి పంట పొలాల్లో వేయాలి.

2. మానవులు లేక జంతువులు నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడకుండా నీటి కుంటల చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయాలి.

3. నీటి కుంటలలో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉన్నప్పుడు శైవలాలు మరియు కలుపు మొక్కలు పెరుగుతాయి. కాబట్టి అవసరమయితే వాటిని తీసేయాలి. అలాగే నీటి కుంటల గట్లపై తరచూ పెరిగే కలుపు మొక్కలను గ్లైఫోసేట్ కలుపు మందు 10 మి.లీ/లీ. నీటికి కలిపి పిచికారి చేసి నియంత్రించాలి.

**నీటి కుంటల వలన ఉపయోగాలు :**

I సేకరించిన వర్షపు నీటిని నీటి కుంటలలో నిల్వ చేసి, క్రింది విధంగా వివిధ అవసరాలకు వాడుకోవచ్చు.

- ఋతుపవనాలు ఆలస్యమైనప్పుడు విత్తనాలు సరైన సమయానికి విత్తి మొలకెత్తించుటకు
- పంట మధ్య లేక చివరి దశలలో బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు (ఎర్ర నేలల్లో 10 రోజులు లేక నల్ల భూముల్లో 15-20 రోజుల వరకు వర్షం రాని యెడల) ఒకటి లేక రెండు తడులు ఇచ్చి పంటను కాపాడుటకు.
- నీటి కొరత ఉన్న ప్రాంతాలలో పశువులు నీరు త్రాగడానికి.
- మెట్టభూముల్లో ఉద్యానవన పంటలకు నీరు యిచ్చుటకు.
- వర్షాకాలంలో బెట్ట పరిస్థితులలో ఒకటి లేక రెండు తడులు ఇచ్చి కూరగాయల పంటలు పండించుటకు.
- పిచికారి చేయుటకు.
- అధిక వర్షాల వలన నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండే పరిస్థితుల్లో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

II లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు సమస్య ఉండదు, అలాగే పంటలు నీట మునగవు.

**నీటి కుంటల నిర్మాణం ఖర్చు :** తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ కమీషనర్, హైదరాబాద్ ఆదేశాలను అనుసరించి నీటి కుంట త్రవ్వుటకు మరియు హె.డి.పి.ఇ. షీట్ తో లైనింగ్ కొరకు అయ్యే మొత్తం ఖర్చులో రైతులకు 50% సబ్సీడి ఇచ్చే విధంగా పథకం అమలవుతున్నది.

అలాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద డి.ఆర్.డి.ఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ అధికారి) వారు, ఐదు ఎకరాల వరకు పొలం ఉండి దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న రైతులకు 100% సబ్సీడీ తో నీటి కుంట త్రవ్వటం మరియు లైనింగ్ చేయుటకు సహాయం అందిస్తున్నారు.

10 మీ. పొడవు × 10 మీ. వెడల్పు × 2.5 మీ. లోపు ఉన్న నీటి కుంట త్రవ్వుటకు మరియు లైనింగ్ వేయుటకు దాదాపు రూ. 25,000-30,000 ఖర్చు అవుతుంది.

**పరిశోధన ఫలితాలు :** సేకరించి మరియు నిల్వ చేసిన వర్షపు నీరు, భూ ఉపరితల నీరు మరియు భూగర్భ జలాల కంటే విలువైనది. కావున ఆధునిక సాంకేతిక నీటి పారుదల పద్ధతుల ద్వారా నీటిని పొదుపుగా వాడి నీటి వృధాను తగ్గించి అధిక ఉత్పాదకత మరియు నీటి వినియోగ సామర్థ్యం సాధించవలసిన అవసరం ఎంతైన ఉంది. ఆధునిక నీటి పారుదల పద్ధతులలో తుంపర సేద్యం మరియు బిందు సేద్యం అతి ముఖ్యమైనది.

ఈ పద్ధతుల ద్వారా మొక్కజొన్న, ప్రత్తి, ఆముదం, కంది మొదలైన పంటలలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెంలో పరిశోధన జరిగింది. ఈ పంటలలో శాఖీయదశ, పూతదశ లేక కాయ అభివృద్ధి చెందే దశలలో బెట్ట వచ్చినప్పుడు 30-35 మి.మీ నీటిని తుంపర లేక బిందు సేద్య పద్ధతిలో ఇచ్చినప్పుడు వర్షాధార పంటతో పోలిస్తే 100% మరియు సాంప్రదాయ పద్ధతి నీరిచ్చిన పంటతో పోలిస్తే 40-50% అధిక దిగుబడులు నమోదయినవి.

ఒక హెక్టారు పరివాహక ప్రాంతం నుండి సేకరించి నిల్వ చేసిన వర్షపు నీటితో సాంప్రదాయ పద్ధతిలో ఒక ఎకరాకు ఒక తడి ఇవ్వగలిగితే, అదే నీటిని 1.75-2.0 ఎకరాలకు ఒక తడి ఇవ్వడమేకాకుండా అధిక దిగుబడి మరియు నీటి వినియోగ సామర్థ్యం సాధించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9441312264**

# ఖరీఫ్ పంటల అంచనా ధరలు

డా॥ ఆర్. విజయకుమారి
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2017-18 సం॥ ఖరీఫ్ కాలములో సాగుచేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 9 నుండి 16 సం॥ల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలను మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2017-18 ఖరీఫ్ పంట కోత సమయంలో ధర ఏవిధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

| క్ర.సం. | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి) |
|---|---|---|---|---|
| 1. | జొన్న | మహబూబ్‌నగర్ | సెప్టెంబర్-అక్టోబర్ | 1200-1450 |
| 2. | సజ్జ | నిజమాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 1200-1400 |
| 3. | పెసర | సూర్యాపేట | సెప్టెంబర్-అక్టోబర్ | 4300-4500 |
| 4. | సోయాచిక్కుడు | ఆదిలాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 2900-3100 |

**గమనిక:** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 9 నుండి 16 సం॥ల ధరలను విశ్లేషించి అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9948780355, 9154828514**
e-mail:npmi.pjtsau@gmail.com, Website: www.pjtsau.ac.in




ఆదాయం అంతగా రాని మామిడి ముదురు తోటలను దగ్గరగా నాటిన ఒత్తైన తోటలను నరికివేసి మళ్ళీ తోటపెంచి కాపురావటానికి చాలా కాలం పడుతుంది. అంతవరకు వేచి ఉండటం రైతుకు ఆర్థికంగా భారమౌతుంది. ముదురు తోటల్లోని చెట్లను పునరుద్ధరించి రెండు, మూడేళ్ళలో సుస్థిర దిగుబడులు తేవాలంటే చెట్ల కత్తిరింపు భూమట్టానికి 2-4 మీటర్ల ఎత్తులో జూలై-సెప్టెంబరు మధ్యలో చేయాలి. మొదట చెట్టు ఆకృతి గొడుగులా వచ్చేటట్లు ప్లాన్ చేసుకోవాలి. చెట్టు మొదలు నుంచి నాల్గు దిశలలో ఉన్న పెద్ద కొమ్మలను 75 సెం.మీ. పై నుండి కత్తిరించాలి. కొమ్మల కత్తిరింపునకు మాములు రంపం కంటే, పెట్రోలుతో నడిచే యాంత్రిక రంపము మేలు, కత్తిరించి నప్పుడు, బెరడు, కొయ్య చీలకుండా ముందుగా కొమ్మ అడుగుభాగంను 15-20 సెం.మీ. లోతుకు కోసి తర్వాత పై భాగాన కొయ్యాలి. పొడుగాటి బలమైన కొమ్మలను కత్తిరించి, తాడుకట్టి తిన్నగా నేలపై ఒరిగేటట్లు చేయాలి. కత్తిరించిన భాగాలను శిలింధ్రాలు ఆశించకుండా బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ పూత పూయాలి. అంతవరకు రైతుకు మంచి ఆదాయముండదు. కాబట్టి తోటలో వరుస మార్చి వరుసలోని చెట్లను కత్తిరించటం లాభదాయకం. ఈ పద్ధతిలో కత్తిరింపుకానీ సుమారు సగం చెట్లను, సూర్యరశ్మి వెలుతురు గాలి బాగా ప్రసరించి, నేలకు ఎండ బాగా తగిలి రెట్టింపు పంట వచ్చి, కత్తిరించిన చెట్ల నుండి పంట రాకున్న, ఆర్థిక నష్టముండదు. అంతేకాక కత్తిరించిన కొమ్మల నుంచి వచ్చిన కలప, కట్టె ద్వారా కొంత ఆదాయమొస్తుంది. నష్టం అంతగా ఉండదు.

### కత్తిరించిన చెట్ల నిర్వహణ :

చెట్లు కత్తిరించాక ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, కలపుతీత, అంతరకృషి, సస్యరక్షణ జాగ్రత్తగా చేయాలి. అప్పుడే ఆరోగ్యమైన కొమ్మలు, ఆకులు పుట్టి, పెరిగి చెట్టు మంచి ఆకృతికి రావడం జరుగుతుంది. కత్తిరించిన తరువాత పొటాష్ అందించాలి. పశువుల ఎరువు, సూపర్ ఫాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ లను పూర్తిగాను, యూరియా సగం, కొమ్మలు కత్తిరించిన వెంటనే (జులై-సెప్టెంబర్ మాసంలోను, మిగిలిన సగం యూరియా డిసెంబర్-జనవరి నెలల్లో చెట్టు పాదిలో సమంగా చల్లాలి. పాదులో చల్లిన ఎరువులు నేలలో కలిసేటట్లు తిరగపెట్టాలి. చెట్టు రెమ్మలు తొడగటం మొదలుపెట్టినప్పటి నుంచి శీతాకాలం, వేసవి కాలమంతా నేలలో తగినంత తేమ ఉండేటట్లు 15-20 రోజుల కొకమారు నీటి తడులిస్తుండాలి.

### నాసిరకం చెట్లను నాణ్యమైన చెట్లుగా టాప్ వర్కింగ్ తో మల్చటం :

మనం రాష్ట్రంలో సుమారు 35 లక్షల టన్నుల మామిడి పండ్ల ఉత్పత్తి జరుగుతుంది. సగటు దిగుబడి హెక్టారుకు 10 టన్నులు మాత్రమే. ఈ పరిస్థితులను ఒకసారి విశ్లేషిస్తే ప్రస్తుత వ్యాపార రీత్యా ఈ తోటలు అంత అనుకూలంగా లేవు. ఇటువంటి తరుణంలో నాణ్యత లేని లాభసాటి కాని నాసిరకం తోటలను నరికి కొత్త తోట వేసే కంటే టాప్ వర్కింగ్ అనే తలమార్పిడి పద్ధతిలో రెండు మూడు సంవత్సరాలలో కాపును పొందవచ్చు. దీనివల్ల మూడు, నాలుగు సంవత్సరాలు కలిసిరావటమే గాక, లాభాసాటి కానీ చెట్లస్థానే నాణ్యమైన, వాణిజ్యపరమైన రకాలను అంటుకట్టి మంచి దిగుబడి, రాబడినిచ్చే తోటలుగా మార్చవచ్చు.

### టాప్ వర్కింగ్ చేయు విధానం :

మొట్టమొదటగా మనకు అవసరం లేని తక్కువ దిగుబడినిచ్చు రకాల చెట్టు కొమ్మలను 4-5 అడుగుల ఎత్తువరకు లావుపాటి కొమ్మలను ఉంచి మిగిలిన పై భాగాన్ని నరికి వేయాలి. ఈ కొమ్మలను నరికేటప్పుడు చీలకుండా జాగ్రత్త పడాలి. కొమ్మ చివరి భాగంలో వాలుగా కత్తిరిస్తే



తేమ, వర్షపు నీరు నిలువక జారిపోతుంది. తద్వారా చీడపీడలు అంతగా సోకవు. చీడపీడలు ఆశించకుండా ఉండటానికి కత్తిరించిన భాగాలకు బోర్డో పేస్టు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ పేస్టుగా పూయాలి. ఇలా కొమ్మలను నరకడం అనేది వర్షాధారంగా పండించే తోటల్లో అయితే ఋతుపవనాలు వచ్చే ముందు, నీటి పారుదల క్రింద పెంచే తోటల్లో అయితే సంవత్సరంలో ఎప్పుడైన కత్తిరించవచ్చు. కానీ వేసవి కాలం శ్రేయస్కరం కాదు.

**అంటుకట్టుట (గ్రాఫ్టింగ్) :**

మామిడి చెట్ల మీద మనకు కావాల్సిన తల్లి రకాల సయాన్ పుల్లలను వెనీర్ లేదా వెడ్జ్ గ్రాఫ్టింగ్ పద్ధతులలో కట్టవచ్చు. ఈ పద్ధతిలో మొదట సయాన్ రెమ్మల ఎంపిక, సేకరణలో జాగ్రత్తలు చాలా ముఖ్యం. మార్చి, ఏప్రిల్ మాసాల్లో పెట్టిన రెమ్మలను అంటే దాదాపుగా 4-5 నెలల వయసున్న రెమ్మలను ఎంపిక చేసుకోవాలి. ఈ రెమ్మల కాండం గుండ్రంగా చర్మం ఆకుపచ్చగా కాకుండా గచ్చకాయ రంగులో ఉండాలి. అది పెన్సిల్ మందంలో ఉండి 15-20 సెం.మీ. పొడవు ఉండాలి. రెమ్మ చివర మొగ్గ పెద్దదిగాను, ప్రస్ఫుటంగాను ఉండాలి. 7-8 రోజులలో తొడిమలు రాలిపోతాయి. ఈ సమయంలో రెమ్మలను కత్తిరించి సేకరించాలి. ఇలా ముందుగానే ఆకులను తొలగించడం వల్ల సయాన్ రెమ్మ చివర మొగ్గ బాగా ఉబ్బి చిగురించడానికి సిద్ధంగా తయారవుతుంది.

**గ్రాఫ్టింగ్ తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు :**

1. గ్రాఫ్టింగ్ కట్టిన కొమ్మలను మాత్రమే పెరుగనిచ్చి అంటు క్రింద భాగాన వచ్చే అన్ని కొమ్మలను తీసివేయాలి.
2. అలాగే క్రొత్తగా చిగురు తొడిగిన రెమ్మలు గాలికి విరిగి పోకుండా జాగ్రత్తపడాలి.
3. వెనీర్ గ్రాఫ్టింగ్ పద్ధతిలో అంటు కట్టినప్పుడు నాసిరకం కొమ్మలు అంటు పై భాగాన ఎక్కువగా వచ్చు ఇగుర్లను ఎప్పటికప్పుడు తీసివేయడం వల్ల అంటు భాగానికి పోషక పదార్థాలు పుష్కలంగా అంది అంటు భాగపు కొమ్మ బాగా పెరుగుతుంది. ఈ విధమైన కొమ్మలు వెడ్జ్ గ్రాఫ్టింగ్ చేసినప్పుడు పెరగడం అనేది ఉండదు.
4. ప్రధాన కాండం మీద వచ్చే కొమ్మలను కూడా ఎప్పటికప్పుడు తొలగించాలి.
5. అంటు భాగం పెరుగుటకు నీరు, ఎరువులను అందించాలి.



6. సాధారణంగా అంటు భాగపు కొమ్మ ఆకులు లేతగా ఉన్నప్పుడు కొన్ని రకాల ఆకులు తినే పెంకు పురుగు, రసం పీల్చు పురుగులు ఆశించి సరిగ్గా పెరగనివ్వవు, దీని నివారణకుగాను అంతర్వాహిక మందులైన మోనోక్రోటోఫాస్, డైమిథోయేట్ వంటి పురుగు మందుతోపాటు శిలీంధ్ర నాశిని అయిన కార్బండాజిమ్ + వేప సంబంధ ఉత్పత్తులను కూడా కలిపి పిచికారి చేస్తే చీడ పీడలు ఆశించకుండా ఉంటాయి.
7. గ్రాఫ్టింగును జులై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలో చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8374449066**



# మిరప నాటు సమయం మరియు తొలిదశలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు

డా॥ ఎ. వెంకట్ రెడ్డి, కె. మానస, డి. సర్వయ్య మరియు డా॥ పి. రఘురామి రెడ్డి
వ్యవసాయ కళాశాల, వరంగల్

తెలంగాణ రాష్ట్రంలో పండించే వాణిజ్య పంటలలో మిరప చాలా ప్రధానమైన పంట. ఈ పంటను సుమారుగా 0.79 లక్షల హెక్టార్లలో సాగుచేస్తూ రమారమి 2.8 లక్షల టన్నుల దిగుబడిని సాధించడం జరుగుతోంది. మిరప పంటలో అధిక దిగుబడుల సాధన కొరకు రైతులు విపరీతంగా ఖర్చు పెట్టడం జరుగుతుంది. ఎకరా మిరప సాగుకు సుమారుగా రూ. 25,000-50,000 తగ్గకుండా ఖర్చు పెట్టడం జరుగుతుంది. అధిక దిగుబడుల కొరకు అధిక దిగుబడులనిచ్చే హైబ్రిడ్ వంగడాలు, సూటి రకాలు, అధిక ఎరువులు, సమగ్ర నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం తదితర విషయాలలో జాగ్రత్త వహించినప్పటికీ మరో వైపు నారుమడి దశ నుండి పైరు కోత చివరి దశ వరకూ పలు రకాల చీడపీడలు ఆశించి విపరీత నష్టం కలుగజేస్తున్నాయి. ప్రధానంగా నారుమడి దశలో మరియు తొలిదశ (శాఖీయ దశ)లో ఆశించే చీడపీడల విషయంలో అజాగ్రత్త వహించినట్లయితే తదుపరి దశలో చీడపీడల ఉధృతి అధికమై సాగు పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కావున రైతాంగం నాటే ముందు, నాటు సమయం మరియు పంట తొలి దశలో కొన్ని ముందు జాగ్రత్త సస్యరక్షణ చర్యలు పాటించినట్లయితే రైతుకు తక్కువ ఖర్చుతో అధిక మరియు నాణ్యమైన దిగుబడులు పొందే వీలు కలుగుతుంది. కావున మిరప నారు చివరి దశలో, నాటేముందు, పైరు తొలి దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతుల గూర్చి తెలుసుకొందాం.

**1. నారుమడి చివరి దశ:**

- నారుమడిలో మొక్కలు నాటడానికి సిద్ధంగా తయారైన వెంటనే చీడపీడలు సోకిన మొక్కలను విధిగా వేరుచేసి పీకి కాల్చి వేయాలి. ముఖ్యంగా వైరస్ తెగుళ్ళు సోకిన నారు మొక్కలను తొలి దశలోనే గుర్తించి కాల్చివేయాలి.
- నారు పీకడానికి వారం రోజుల ముందు ఒక సెంటు (40 చ.మీ.) నారుమడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలు వేయాలి. దీని వలన రసంపీల్చు పురుగుల నివారణ జరగడం వలన నాటిన తర్వాత మొక్క ఏపుగా పెరుగుతుంది.
- నారుమడిలో ముఖ్యంగా వర్షాలు పడే వాతావరణంలో "కోయినోఫోరా" కొమ్మ ఎండు తెగులు సోకే అవకాశం ఉంటుంది. కావున తప్పకుండా ఈ తెగులును నివారించడానికి 1 లీ. నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాప్టాన్ 2.5 గ్రా.+10 లీ. నీటికి 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారి చేయాలి.



"కోయినోఫోరా" కొమ్మ ఎండు తెగులు

- నారుమడిలో కాండం కుళ్ళు తెగులు ఆశించిన యెడల లీటరు నీటికి 1.5 గ్రా. థయోఫినేట్ మిథైల్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారి చేయాలి.



కాండం కుళ్ళు తెగులు

- నాటడానికి ముందు నారు వేర్లను పురుగు మందు, శిలీంద్రనాశక మందులతో కలిపిన నీటిలో 20-30 ని॥ ఉంచి నాటినట్లయితే తొలి దశలో ఆశించే చీడపీడలు నివారింపబడును. ఇందు కొరకు 1 లీ. నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 5 గ్రా. ట్రైకోడెర్మా విరిడి+ 2.0 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపిన ద్రావణం తయారుచేసుకోవాలి.

### 2. నాటు సమయం :

- హైబ్రిడ్ రకాలయితే 20-25 రోజులకు, సూటి రకాలను 30-35 రోజులలో నాటడం మంచిది. వీలైనంత వరకు ముదురు నారు వాడరాదు.
- మిరప నాటే ముందు పైరు చుట్టూరా 2-3 వరుసలలో జొన్న లేదా మొక్కజొన్న పైరు విత్తనాలను ఒత్తుగా విత్తుకోవాలి. దీని వలన పురుగుల ఉధృతి తగ్గడానికి మంచి వీలుంటుంది.
- ప్రధాన పంటలో లేదా గట్లపైన ఎకరాకు 15-20 బంతి మరియు ఆముదం మొక్కలు ఉండేలా విత్తుకోవాలి. బంతి పంట శనగ పచ్చ పురుగుకు, ఆముదం పొగాకు లద్దె పురుగుకు ఆకర్షణ పంటగా పనిచేస్తాయి.
- సాధారణ పద్ధతిలో కాకుండా "ప్లాస్టిక్ మల్చింగ్" పద్ధతిలో సాగుచేసిన యెడల ఇతర అనేక ప్రయోజనాలతోపాటు కొన్ని రకాల చీడపీడలు ముఖ్యంగా తామర పురుగులు, వేరుకుళ్ళు ఉధృతి బాగా తగ్గుతుంది. ఇందుకు 90 సెం.మీ. వెడల్పు, 30 సెం.మీ. ఎత్తుగల ఎత్తు బెడ్స్ తయారు చేసి బెడ్స్‌పై ఇరువైపులా 2 వరుసలలో మొక్కలు నాటుకొని డ్రిప్ ద్వారా నీటిని అందించాలి.



"ప్లాస్టిక్ మల్చింగ్"



తామర పురుగులు



వేరుకుళ్ళు

- ఎకరాకు 10 టన్నుల పశువుల పెంట లేదా 2-3 టన్నుల వర్మికంపోస్టు మరియు 2-3 క్వింటాళ్ళ వేప గింజల పొడి వేయాలి. దీని వలన నేలలో సేంద్రియ పదార్థం ఎక్కువవడం వలన కొన్ని రకాల చీడపీడలు అదుపులో ఉంటాయి. మరియు ఎకరాకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ పశువుల పెంటతో కలిపి భూమిలో వేయాలి.
- సూచించిన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులతో పాటుగా సూక్ష్మధాతువులు ముఖ్యంగా ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేసి సమగ్ర పోషక యాజమాన్యం పాటించినట్లయితే చీడపీడలు అదుపులో ఉంటాయి.

### 3. నాటిన తొలి దశ:

- ఈ పంటలో ఆశించే కొన్ని చీడపీడలు ముఖ్యంగా వైరస్ తెగుళ్ళు కలుపు మొక్కల ద్వారా వ్యాపిస్తాయి. కావున కలుపు మొక్కలు రాకుండా తగు జాగ్రత్త వహించాలి. తొలిదశలో వైరస్ తెగుళ్ళను అదుపులో ఉంచినట్లయితే వైరస్ తెగుళ్ళ వలన జరిగే నష్టాన్ని చాలా వరకు అధిగమించవచ్చు.
- నాటిన 7-10 రోజుల దశలో ఒక ఎకరాకు 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు మొక్క మొదళ్ళ దగ్గర గుంత తీసి వేయాలి. దీని వలన రసంపీల్చు పురుగులు అదుపులో ఉంటాయి. పైపాటుగా పురుగు మందులను 20-30 రోజుల వరకు వాడాల్సిన అవసరం రాదు.
- మిరప తోటలలో ఎట్టి పరిస్థితులలోనూ ముఖ్యంగా వంగ మొక్కలను పెంచరాదు. ఈ పైరు తెల్లదోమ, మిడ్జి ఈగకు ఆశ్రయం కల్పించును.
- పైరు తొలిదశ నుండి రసంపీల్చు పురుగుల ఉధృతిని అదుపులో పెట్టడానికి తామర పురుగులకు నీలి రంగు జిగురు అట్టలు, తెల్లదోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను పెట్టి పైరు ఎదుగుదలను బట్టి అట్టల ఎత్తును పెంచాలి.
- పైరు ఏ దశలోనూ సిఫారసు లేని మందులు ముఖ్యంగా "బయో మందులు" ఎట్టి పరిస్థితులలోనూ వాడరాదు.
- పంట తొలిదశలో ఆశించే చీడపీడల నివారణకు ఈ క్రింది మందులు వాడాలి.

| క్ర.సంఖ్య | చీడపీడలు | మందు మోతాదు (1 లీ.) | మందు మోతాదు (ఎకరాకు) |
|---|---|---|---|
| 1. | పేనుబంక | ఇమిడాక్లోప్రిడ్-0.25 మి.లీ.<br>థయోమిథాక్సామ్ - 0.2 గ్రా.<br>ఎసిఫేట్ - 1.5 గ్రా.<br>ఎసిటామిప్రిడ్ -0.2 గ్రా. | 50.0 మి.లీ.<br>40.0 గ్రా.<br>300 గ్రా.<br>40.0 గ్రా. |
| 2. | తామర పురుగులు | ఎసిఫేట్ - 1.5 గ్రా.<br>ఫిప్రోనిల్ - 2.0 మి.లీ.<br>స్పైనోసాడ్ - 0.35 గ్రా.<br>డైఫెన్ థైయూరాన్ - 1.5 గ్రా. | 300 గ్రా.<br>400 మి.లీ.<br>75 గ్రా.<br>300 గ్రా. |
| 3. | తెల్లదోమ | ట్రైజోఫాస్ - 1.25 మి.లీ.<br>డైఫెన్ థైయూరాన్ - 1.5 గ్రా.<br>ఎసిఫేట్ - 1.5 గ్రా.<br>ఎసిటామిప్రిడ్ -0.2 గ్రా. | 250 మి.లీ.<br>300 గ్రా.<br>300 గ్రా.<br>40.0 గ్రా. |
| 4. | కోయినోఫోరా కొమ్మ ఎండు తెగులు | కాపర్ ఆక్సీక్లోరైడ్ - 3 గ్రా.<br>హెక్సాకొనజోల్ - 2.0 మి.లీ.<br>స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా./10 లీ. | 600 గ్రా.<br>400 మి.లీ. |
| 5. | కాండంకుళ్ళు తెగులు | థయోఫినేట్ మిథైల్ 1.5 గ్రా.<br>కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. | 300 గ్రా.<br>600 గ్రా. |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9908186020**



# పొట్లకాయలోని పోషక విలువలు మరియు ఆర్థిక అంశాలు

ఎస్. వాహిని, కె. కీర్తి మరియు బి. రఘురామి రెడ్డి
వ్యవసాయ కళాశాల, వరంగల్

పొట్లకాయలు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో వాడుకలో ఉన్నాయి. పొట్లకాయలను భారతీయులు రకరకాల కూరలు, పచ్చళ్ల రూపంలో తీసుకుంటారు. కొన్ని దేశాల్లో పొట్లకాయలు బాగా పండిన తర్వాత వాటి గుజ్జును టమాటా గుజ్జుకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగిస్తారు. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో పొట్ల మొలకలను, ఆకులను కూడా తింటారు. పొట్లకాయను వృక్ష పరిభాషలో "ట్రైకోసాంతస్ కుకుమెరీనా ఎల్ వార్ అంగ్వినా" అంటారు.

**పోషకాలు:** పొట్లకాయల్లో పీచు పదార్థాలు, స్వల్పంగా ప్రోటీన్లు, పిండి పదార్థాలు, విటమిన్-ఎ, బీటా కెరోటిన్, విటమిన్-బి1, బి2, బి3, బి6, బి9, విటమిన్-సి వంటి విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పాస్పరస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి ఖనిజ లవణాలు ఉంటాయి.

**ఆరోగ్య లాభాలు:** పొట్లకాయలో నీటి శాతం ఎక్కువగాను, కాలరీలు మరియు క్రొవ్వు తక్కువగా ఉండడం వలన శరీరానికి కావలసిన సమతుల్య ఆహారం అందుతుంది. పొట్లకాయలు కడుపు ఉబ్బరాన్ని తొలగిస్తాయి. వీటిలో పుష్కలంగా ఉండే పీచు పదార్థాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. తాజా పొట్లకాయలో ఫోలిక్ ఆసిడ్ అధికంగా ఉండడం వలన గర్భవతులు వీటిని తరచుగా తీసుకుంటే గర్భస్థ దశలో వచ్చే "నాడీ ట్యూబ్ లోపాలు" రాకుండా కాపాడుతుంది.

ఇందులోని విటమిన్-సి కాన్సర్ బారి నుండి కాపాడుతుంది. కొలెస్ట్రాల్‌ను పెరగనివ్వదు. ఫలితంగా గుండె జబ్బుల ముప్పును గణనీయంగా తగ్గిస్తుంది. జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉండడం వలన రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

ఈ కాయలో నీటి శాతం అధికంగా ఉండడం వలన శరీరంలో నిర్జలీకరణ కలగకుండా చేస్తుంది. అదేవిధంగా మూత్రపిండాలలో ఇబ్బందులు ఉన్నవారికి కూడా పొట్లకాయ బాగా పనికివస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి.



**ఆర్థిక అంశాలు:**

పొట్లకాయ కూరగాయల్లో ఎక్కువగా ఆదరణ పొందనిది. కానీ ఇందులోని పోషక విలువలను బట్టి మనము ఈ కూరగాయను పెరట్లో పండించుకోవచ్చు.

లేదా వాణిజ్య పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. పొట్ల కాయను ఒక సంవత్సరానికి ఎకరా భూమిలో సాగు చేసుకొనుటకు కాలక్రమేణా అయ్యే ఖర్చు క్రింది పట్టికలో వివరించబడింది.

| క్ర. సం. | సేద్య పద్ధతుల వివరాలు | ఖర్చు (రూ.) |
|---|---|---|
| 1. | దుక్కి తయారి | 1,800-2,500 |
| 2. | సేంద్రియ ఎరువుల వేయడం | 1,000-1,500 |
| 3. | సేంద్రియ ఎరువుల ఖర్చు | 4,000-6,000 |
| 4. | మల్చింగ్ షీట్లను వేయటం | 500-600 |
| 5. | మల్చింగ్ షీట్ల ఖర్చు | 4,000-6,000 |
| 6. | విత్తనం ఖర్చు | 3,000-4,000 |
| 7. | మొక్కలు నాటడం | 400-500 |
| 8. | రసాయన ఎరువులు వేయటం | 3,00-4,000 |
| 9. | రసాయన ఎరువుల బస్తాల ఖర్చు | 4,500-5,500 |
| 10. | సస్యరక్షణ చర్యలు (పురుగు మందుల పిచికారి) | 1,500-2,250 |
| 11 | పురుగు మందుల ఖర్చు | 1,200-3,000 |
| 12. | పంట కోతకయ్యే ఖర్చు | 10,000-12,000 |
| | మొత్తం ఖర్చు | 34,900-47,850 |
| | దిగుబడి/ఎకరాకు : 10-12 టన్నులు<br>హోల్ సేల్ ధర: కిలోకి రూ.5-15/- | |
| | స్థూల ఆదాయం/ఎకరాకు | 50,000-1,80,000 |
| | నికర ఆదాయం/ఎకరాకు | 15,100-1,32,150 |

**గమనిక : ప్రబలమైన స్థానిక పరిస్థితుల ప్రకారం ధరలు మారవచ్చు.**

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441262490**

# గులాబిని ఆశించే చీడపీడలు-సస్యరక్షణ

భానోత్ శ్రీను, డా॥ డి. అనిత కుమారి, డా॥ యం. హనుమాన్ నాయక్ మరియు టి. నవ్య శ్వేత
కూరగాయల పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్
శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

పూల పంటలలో గులాబి ఒక ముఖ్యమైన పంట. గులాబి సాగు మన రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి మరియు మెదక్ జిల్లాల్లో అధికంగా సాగుచేస్తున్నారు. గులాబిలో పురుగులు మరియు తెగుళ్ళ సమస్య వలన దిగుబడి తగ్గుతున్నది.

**పేనుబంక:** పిల్ల, తల్లి పురుగులు లేత కొమ్మలు, పువ్వులు మరియు మొగ్గల మీద చేరి రసం పీలుస్తాయి. లేత కొమ్మలు వాడిపోయి ఎండిపోతాయి. మొగ్గలు అభివృద్ధి చెందక లేత మొగ్గలుగా ఉన్నప్పుడే రాలిపోతాయి.

**నివారణ :** డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ 1 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 మి.లీ. లేదా వేపనూనె 5 మి.లీ./లీ. నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**తామర పురుగులు:** పిల్ల, తల్లి పురగులు క్రొత్తగా చిగురిస్తున్న ఆకులు, పూమొగ్గల మీద ఆశించి పూరేకుల మీద రసాన్ని పీల్చటం వలన పూమొగ్గలు సరిగా విచ్చుకోవు. ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు వడలిపోయి రాలిపోతాయి. పూరేకులపైన మరియు ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ఇటువంటి పూమొగ్గలు మార్కెట్‌కు పనికిరావు.

**నివారణ:** ముందుగా పురుగులను గమనించినట్లయితే అధిక పీడనంతో నీటిని పిచికారి చేసి తరువాత ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సాం 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ./లీ. నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**ఎర్రనల్లి:** ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి గూడుకట్టి, రసాన్ని పీల్చివేస్తాయి. వీటి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు అడుగు భాగాన గోకినట్లు ఉండి పైభాగాన కంచు రంగు మచ్చలు ఏర్పడతాయి. చివరకు ఆకులు కూడా ముడుచుకుపోతాయి.

**నివారణ:** 2 మి.లీ. డైకోఫాల్ లేదా గంధకం 2 గ్రా. లేదా ఎబామెక్టిన్ 0.4 మి.లీ. లేదా డైఫెన్ త్యురాన్ 0.5 గ్రా. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ./లీ. నీటికి కలిపి ఏడు రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**నల్లమచ్చ తెగులు:** నల్లమచ్చలు ఆకుల పైభాగంలో ఏర్పడుతాయి. ఈ నల్లటి మచ్చలు ఆకుపై 1/16 నుండి 1/2 అంగుళాల పరిమాణంలో వుంటాయి. ఆకుల పైభాగంలో ఏర్పడిన నల్లని మచ్చల చుట్టూ మొత్తం పసుపు రంగులో వుంటుంది. ఈ నల్లని మచ్చలు గుండ్రని



ఆకారంలో వుండి ఒక విధమైన ముగింపు అంటూ వుండదు. తరువాతి దశలో ఆకు అంతట ముదిరిపోయి పసుపు రంగులోకి మారి ఆకు రాలిపోతుంది. ఈ తెగులు అధికంగా వర్షాకాలం ఆరంభంలోను మరియు శీతాకాలంలో పడే మంచు వలన ఎక్కువగా వ్యాపిస్తుంది.

**నివారణ:** తెగులు సోకిన ఆకులను పోగుచేసి నాశనం చేయాలి. తెగులు నివారణకై 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండాజిమ్ 2 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**బూడిద తెగులు:** తెగులు లక్షణాలు మొదటగా బూడిద వంటి తెల్లని పొడి ఆకుల పైభాగంలో, కాండం మీద మరియు పూమొగ్గల మీద ఒక పొర లాగ ఏర్పడుతుంది. తెగులు ఆశించిన పూమొగ్గలు వికసించవు మరియు ఆకర్షితమైన పూవులు పూయవు. సాధారణంగా ఈ తెగులు వాతావరణంలో చల్లగా వుండి గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నట్లయితే ఆశిస్తుంది.



**నివారణ:** తెగులు ఆశించిన మొక్కలపై గంధకం 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1గ్రా./లీ. నీటికి కలిపి ప్రతి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి. వ్యాధి ఉధృతి అధికం అయితే డెనోకాఫ్ 1 మి.లీ. లేదా ట్రైడిమార్ఫ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. తెగులు నివారణకై 25 కిలోల గంధకంను ఒక హెక్టారు పొలంలో వేసుకోవాలి.

**ఎండు తెగులు:** ఈ తెగులు ముదురు మొక్కలను ఆశించి నష్టపరుస్తుంది. మొక్క శాఖీయ భాగాల కొన భాగం నుండి మొదలుకొని క్రిందకు ఎండుపోవుంటుంది. ముఖ్యంగా కొమ్మల కత్తిరింపులు చేపట్టినప్పుడు, కత్తిరించిన చివర్ల నుండి ఈ తెగులు ప్రారంభమై కొమ్మలు ఎండిపోతూ వుంటాయి. తెగులు సోకిన కొమ్మల మధ్య గోధుమ రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారి మొక్క మొత్తం ఎండిపోతుంది. క్రమేణా తెగులు శాఖ భాగాల నుండి వేరు వ్యవస్థ వరకు వ్యాప్తి చెందుతుంది.

**నివారణ:** కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా బోర్డోమిశ్రమంను కొమ్మలు కత్తిరించిన తరువాత పైపూతగా వాడాలి. తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి మొక్క మొదలు భాగం తడిచేలా ముంపుగా తడపాలి.



**త్రుప్పు తెగులు:** ఈ వ్యాధి లక్షణాలు మొదటగా ఆకుల అడుగు భాగాన ఏర్పడతాయి. తెగులు ఆకుల అడుగు భాగాన పసుపుపచ్చని చిన్న చిన్న బొడిపెలు ఏర్పడతాయి. ఈ పసుపుపచ్చని బొడిపెలు క్రమేణ నల్లని ఎరుపు రంగు



మచ్చలుగా తయారవుతాయి. తెగులుకు గురి అయిన ఆకులు వడలిపోతాయి. క్రమేణా ఆకులు చనిపోయి రాలిపోతాయి.

**నివారణ:** తెగులు ఆశించిన ఆకులను ప్రోగుచేసి కాల్చివేయాలి. గంధకం 2.5 గ్రా., కాపర్ 2.5 గ్రా. లేదా టెబుకొనజోల్ 2 మి.లీ./లీ. నీటికి కలిపి మొక్కలపైన పిచికారి చేసుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.**
**9603765843 మరియు 9440162396**




### మామిడి

- పచ్చిరొట్ట పైర్లను తగినంత పూత రాగానే నేలలో కలిసేలా దున్నాలి.
- గూడు పురుగు, కొమ్మలను తొలిచే పురుగు, ఆకులను కత్తిరించే పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తెగుళ్ళ నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- చివరిసారిగా పొలాన్ని దున్నాలి. దీనివల్ల కలుపు ఏదైనా ఉంటే నివారించబడటమేకాకుండా నిద్రావస్థలో ఉన్న పురుగులు నశిస్తాయి. నేల గుల్లబారి, నేల నుండి తడి ఆవిరై, పొడిగా తయారై, బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. దీనివల్ల పూత, రెమ్మలు త్వరగా ముదిరి, పూతకు సిద్ధమై, శాఖీయ పెరుగుదల తగ్గుతుంది.

### జామ

- అధిక వర్షాల వల్ల మొక్కల మొదళ్ళలో నీరు నిల్వ ఉంటే ఎండు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఆకులు పసుపు రంగుకు మారతాయి. కొమ్మలు పై నుండి క్రిందకు ఎండుతాయి. ఆకులు వడలిపోయి రాలిపోతాయి. చెట్టు మోడువారుతుంది. నివారణకు మొదళ్ళలో కార్బండాజిమ్ 1గ్రా. లీటరు నీటిలో కలిపి పోయాలి.

### అరటి

- కొన్ని రకాల నులిపురుగులు వేర్లలోకి జొరబడి రసం పీల్చి వేర్లపై చారలు ఏర్పరుస్తాయి. నులిపురుగులు ఆశించడం వలన వేళ్ళు, దుంప బలహీనపడి మొక్క నీటిని, పోషకాలు సరిగా తీసుకోలేదు. అందువల్ల మొక్కలు వడలినట్లు కన్పిస్తాయి. ఆకుల అంచుల వెంబడి నల్లగా మారి క్రమేపి ఆకులు ఎండిపోతాయి. నివారణకు 40 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు మొక్క మొదలు వద్ద 10 సెం.మీ. లోతులో వేసి మట్టితో కప్పి తేలికగా నీరు పెట్టాలి.

### బత్తాయి, నిమ్మ

- నల్లి నివారణకు 2 మి.లీ. డైకోఫాల్ లేదా 2 మి.లీ. ఇథియాన్ లేదా 3 గ్రా. నీటిలో కరిగే గంధకంను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఈ మాసంలో కాయ రాలటంను నివారించుటకు 100 గ్రా. కార్బండాజిమ్, 2,4-డి 1 గ్రా. లేదా 1.5 గ్రా. నాఫ్తలీన్ ఎసిటిక్ ఆసిడ్‌లను 100 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

### ద్రాక్ష

- తామర పురుగు నివారణకు స్పైనోసాడ్ 0.3 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### సపోట

- మొగ్గతొలిచే పురుగు, ఆకుగూడు అల్లే పురుగులు లేత చిగురు, పూతకు హాని చేస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### బొప్పాయి

- వర్షాల వలన కాండం మొదలు కుళ్ళిపోయి మొక్కలు వాలిపోతాయి. మొదలు నుండి జిగురు లాంటి ద్రవం

కారుతుంది. నివారణకు లీటరు నీటికి 2 గ్రా. రిడోమిల్ యమ్.జెడ్ కలిపి చెట్ల మొదళ్ళకు మరియు కాండాన్ని తడుపుతూ మందును పోయాలి.

### సీతాఫలం

- ఈ మాసంలో చెట్టుకి 250 గ్రా. యూరియా, 250 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి తడి పెట్టాలి.

### జీడిమామిడి

- ఈ మాసంలో జీడి చెట్లకు 550 గ్రా. యూరియా, 375 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 120 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెట్టు మొదలుకు 1.5 మీ. దూరంలో చుట్టూ 15 సెం.మీ. వెడల్పు మరియు లోతు గాడి చేసి ఈ ఎరువులను వేసి కప్పవలెను.

## కూరగాయలు

### టమాట

- తేమ ఉన్న చల్లని వాతావరణంలో ఆకుమాడు తెగులు అధికంగా ఉంటుంది. దీని నివారణకు 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

### వంగ

- రసంపీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తెల్లదోమ అధికంగా ఉన్న యెడల ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### బెండ

- కాయ తొలుచు పురుగు నివారణకు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పంట చివరి దశలో ఎర్రనల్లి ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయి పండుబారుతాయి. నివారణకు లీటరు నీటికి 5 గ్రా. డైకోఫాల్ కలిపి పిచికారి చేయాలి.

### కాకర

- వర్షంతో కూడిన చల్లని వాతావరణంలో బూజు తెగులు ఆశిస్తుంది. మొదట్లో లేత ఆకుపచ్చ, ముదురాకుపచ్చ కలిపి ఆకు మొజాయిక్ వలే కనిపిస్తుంది. తర్వాత ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకులు పండు బారి ఎండిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్.జెడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### కాలీఫ్లవర్

- కాలీఫ్లవర్ శీతాకాలపు పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చును.

### కూరమిరప (సిమ్లా మిర్చి)

- కూర మిరపను కూడా సెప్టెంబర్ నుండి అక్టోబర్ మాసం వరకు బహిరంగ ప్రదేశాలలో నాటుకొని అధిక దిగుబడులు సాధించవచ్చును.

### చిక్కుడు

- పొద చిక్కుడు రబీ పంటను ఈ మాసంలో నాటుకోవచ్చును.

### మిరప

- 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి ఆ నీళ్ళతో నారుమడిని 9వ రోజు, 13వ రోజు తడపాలి.
- 6 వారాల వయస్సు గల మొక్కలను ప్రధాన పొలంలో నాటాలి. వర్షాధార పైరుకి 60×15 సెం.మీ. దూరంలో పాదుకు రెండు మొక్కల చొప్పున, నీటి వసతి క్రింద 60×60 సెం.మీ. ఎడంతో పాదుకు ఒక మొక్క చొప్పున నాటుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441168156**



# జాగ్రత్తలు పాటించకపోతే నష్టాల 'పాలే'

డా॥ జె.సాయి ప్రసన్న
పశు జన్యు శాస్త్ర మరియు ప్రజనన విభాగం,
పశువైద్య కళాశాల, కోరుట్ల

పాలు సంపూర్ణమైన పోషకాహారం, పిల్లలు, పెద్దలు, ముసలివాళ్ళు అన్ని వయసుల వారు ఎంతో ఇష్టంగా తీసుకుంటారు. పాలలో పోషక పదార్థాలు మెండుగా ఉన్నప్పటికీ, చాలా త్వరగా చెడిపోయే స్వభావం కలిగి ఉంటాయి. పాల ఉత్పత్తిలో పాలు పితికేటప్పుడు, పాలు పితికిన తర్వాత నిల్వ చేయడంలో శుభ్రతను పాటించకపోతే త్వరగా పులిసిపోయి చెడిపోతాయి. అపరిశుభ్రమైన పాలకు మార్కెట్లో ధర పలకదు. కాబట్టి రైతులు నష్టపోవలసి వస్తుంది. పైగా ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యత్వం ఉన్న మనదేశంలో ఆ సంస్థ ద్వారా నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయి. వాటిని పాటిస్తేనే మన పాలకు, పాల ఉత్పత్తులకు విదేశాలలో గిరాకీ ఏర్పడి, రైతులకు లాభం చేకూరుతుంది. కాబట్టి రైతులు పరిశుభ్రమైన, నాణ్యమైన పాల ఉత్పత్తి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

పరిశుభ్రమైన పాలు అంటే " ఆరోగ్యమైన పాడి పశువు నుండి శుభ్రంగా ఉన్న పరిసరాల్లో, పరిశుభ్రమైన పాత్రలను, నీటిని ఉపయోగించి, ఆరోగ్యమైన వ్యక్తులు పితికిన పాలు, ఇలాంటి పాలు సహజమైన రంగు, రుచి, వాసనతో, తక్కువ సంఖ్యలో సూక్ష్మక్రిములు ఉండి, ఎటువంటి కల్తీ పదార్థాలు లేకుండా వినియోగదారునికి చేరే వరకు తాజాగా, రుచిగా ఉంటాయి.

పశువుల నుంచి పాలు పితికే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలి. తద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అంతే కాదు స్వచ్ఛమైన పాలూ పొందొచ్చు. ఎక్కువ సమయం పాలు చెడిపోకుండా ఉంటాయి. వీటి నుంచి తీసిన వెన్న, నెయ్యి మంచి రుచి, వాసన కలిగి ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. పాల శుభ్రత అనేది పశువుల ఆరోగ్యస్థితి, కొట్టాల శుభ్రత, పాలు పితికే మనిషి, పాలు నిల్వ ఉండే పాత్రల శుభ్రత మీద ఆధారపడి ఉంటుంది.

**పశువుల కొట్టాల శుభ్రత:** పశువుల కొట్టాలు ఎత్తైన ప్రదేశంలో, గాలి, వెలుతురు ధారాళంగా వీచేలా నిర్మించాలి. మురుగు నీరు పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. షెడ్డులో దోమలు, ఈగలు రాకుండా జాగ్రత్త వహించాలి. తరచుగా డెట్టాల్, ఫినాయిల్ వంటి క్రిమిసంహారక మందు కలిపిన నీటితో శుభ్రం చేస్తుండాలి. నేలను పొడిగా ఉంచాలి. పాలు పితికే 30 నిమిషాల ముందు కొట్టాన్ని శుభ్రపరచి దుమ్ము లేవకుండా నీళ్ళు చల్లాలి. ఈవిధంగా చేసినట్లయితే పాలు దుమ్ము, ధూళితో కలుషితం కాకుండా ఉంటాయి. పేడ, మూత్రం, సైలేజ్, కిరోసిన్, డీజిల్ మొదలగు వాటి వాసనలు పాలు సులభంగా గ్రహిస్తుంది కనుక వాటిని పాకలలో ఉంచరాదు.

**పశువు ఆరోగ్యం:** ఆరోగ్యమైన పాడి పశువు నుండి పితికిన పాలు స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంటాయి. రైతులు తమ పాడి పశువులను ఆరోగ్యంగా ఉండేటట్టు చూడాలి. పాడి పశువులకు క్షయ, బ్రుసెల్లా వంటి వ్యాధులు లేవని నిర్ధారించాలి. పశువులు వ్యాధుల బారిన పడకుండా విధిగా టీకాలు ఇప్పించాలి. ఎప్పటికప్పుడు వివిధరోగాలకు పరీక్షలు నిర్వహించాలి. ఏదైనా వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయితే సమీపంలోని పశువైద్యుని వద్ద చికిత్స చేయించాలి. జబ్బు

పడిన పశువును ఇతర పశువులతో కలవనివ్వకుండా దూరండా ఉంచాలి. వాటి నుండి తీసిన పాలు ఆరోగ్యవంతమైన పశువుల నుండి తీసిన పాలతో కలపరాదు. పూర్తిగా కోలుకున్న తర్వాతనే పాలను వినియోగించాలి.

**పొదుగు శుభ్రత:** పాలు పితికే ముందు పశువు శరీరాన్ని మరియు పొదుగుని శుభ్రంగా కడిగి పొడి గుడ్డతో తుడవాలి. పశువు శరీరానికి మట్టి, పేడ, చొప్ప మొదలగునవి అంటుకొని ఉండి క్రిముల పెరుగుదలకు ఉపకరిస్తాయి. వీటి తోటి పాలు కలుషితం కాకుండా ఉండడానికి పశువు శరీరాన్ని, పొదుగుని పాలు తీసే ముందు కడగాలి. గేదెలలో ఇది చాలా ముఖ్యం ఎందుకంటే వాటికి మట్టిలో దొర్లే అలవాటు ఉంటుంది. పొదుగుని 1% పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంలో ముంచిన టవల్‌తో తుడవాలి. మొదటి రెండు మూడు ధారలలో సూక్ష్మజీవుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది కనుక ఆ పాలను పిండి తీసి వేయాలి. పొదుగును కడగేటప్పుడు చనులకు గాయాలు కాకుండా నెమ్మదిగా కడగాలి. కడిగే నీటి ఉష్ణోగ్రత $55^0$ సెల్సియస్ మించి ఉండరాదు. పాలు పితికిన తర్వాత కూడా డిటర్జెంట్‌లో ముంచిన శుభ్రమైన గుడ్డతో తుడవాలి.

**పాలు పితికే వ్యక్తి శుభ్రత:** పాలు తీసే వ్యక్తి విధిగా శుభ్రత పాటించాలి. టీబీ, కలరా, టైఫాయిడ్, న్యూమోనియా, గజ్జి మొదలగు వ్యాధితో బాధపడేవారు పాలు పితక కూడదు. పాలు పితికే ముందు స్నానం చేసి ఉతికిన బట్టలు ధరించాలి. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. చేతి వేళ్ళ గోర్లను కత్తిరించు కోవాలి. పొడవాటి గోర్ల వల్ల చనులకు గాయాలు అయ్యే అవకాశాలుంటాయి. పాలు పితికేటప్పుడే పొగ త్రాగడం, మాట్లాడడం, ఉమ్మి వేయడం, దగ్గడం, తుమ్మడం, పాన్, గుట్కా మొదలగునవి నమలడం వంటివి చేయకూడదు. పాలలో చేతి వ్రేళ్ళను ముంచరాదు. చేతులకు నూనె మొదలగునవి రాసుకొని పాలు పితక కూడదు. వీలైనంత త్వరగా, ఆపకుండా 6-8 నిమిషాల వ్యవధిలో పాలు పితకాలి.

**పాల పాత్రల శుభ్రత:** పాలు పితకడానికి అల్యూమినియం లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను మాత్రమే వాడాలి. ప్లాస్టిక్ క్యాన్లలో, నూనె డబ్బాల్లో, రాగి పాత్రలలో పాలు పితకరాదు. చిన్న మూతి ఉన్న పాత్రలు వాడాలి. పాల పాత్రలను ప్రతి రోజు సబ్బు నీటితో కడగాలి. తర్వాత ఎత్తైన ప్రదేశంలో ఎండ తగిలేటట్లు పాత్రలను తల క్రిందులుగా ఉంచి ఆరనివ్వాలి. పాల పాత్రలను గాలి వీచే ఒక ప్రత్యేక గదిలో ఉంచాలి. పాలు పితికిన వెంటనే దుమ్ము, ధూళి, పాలలో పడకుండా మూత పెట్టాలి. సాధ్యమైనంత త్వరగా వినియోగదారునికి/శీతలీకరణ కేంద్రానికి చేరే విధంగా శ్రద్ధ వహించాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8008910925

అనుభవజ్ఞులైన శాస్త్రజ్ఞులు మరియు ఇతర అధికారులు తమ అమూల్యమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులోకానికి అందించాలంటే సాంకేతిక వ్యాస రూపంలో పొందుపరచి, శీర్షికకు సంబంధించిన ఛాయా చిత్రాలను మరియు రచయిత ఫోన్ నెంబరును తప్పని సరిగా జత చేసి వ్యవసాయం మాసపత్రికకు పంపించవలసిందిగా మనవి చేస్తున్నాము

విశ్వవిద్యాలయ సౌజన్యంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ద్వారా ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు సాయంత్ర గం॥ 6.50 నుండి గం॥ 7.00 వరకు ప్రసారం చేయబడే వ్యవసాయ సూచనలను రైతులందరూ వినవలసిందిగా కోరుతున్నాము




రంగు రంగుల ఆహారం అనగానే మనకు మొదటగా గుర్తొచ్చె ఆహార పదార్థాలు కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్లు. మారుతున్న జీవన శైలిలో దీర్ఘ కాలికంగా ఎదురయ్యే ఆరోగ్య సంబంధిత జబ్బుల సమస్య నానాటికి పెరుగుతూ వస్తుంది. ఆకుకూరలు, కూరగాయలు మరియు పండ్లను సమృద్ధిగా తీసుకోవటం వలన అనేక రకాలైన జబ్బులను నియంత్రించడానికి మరియు అధిగమించడానికి ఉపయోగపడుతుంది. ఎందుకనగా ఈ ఆహారంలో విటమిన్ ఎ, ఇనుము, విటమిన్ సి, ఫోలిక్ ఆమ్లం అనే సూక్ష్మ పోషకాలు మరియు పీచు పదార్థం, యాంటి ఆక్సిడెంట్లు అనే పోషకేతర ఆహార పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. అంతే కాకుండా ఆకు కూరలు, పసుపు మరియు నారింజ రంగులో ఉన్న కూరగాయలు, పండ్లు, సూక్ష్మ పోషక పదార్థాల లోపాలను మరియు దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి.

## కూరగాయలు మరియు పండ్లలో ఎక్కువగా ఉండే సూక్ష్మ పోషకాలు

### 1. విటమిన్ - ఎ

ఎపిథీలియల్ కణజాలం సవ్యంగా ఉండడానికి మనకు వెలుతురులో సరిగా చూడగలగడానికి, ఈ క్రొవ్వులో కరిగే విటమిన్ అవసరం. విటమిన్-ఎ లోపించినపుడు, కంటిలోని తెల్ల గుడ్డు దాని మెరుపును కోల్పోయి, తడి లేకుండా పోతుంది. లోపం మరీ తీవ్రమైతే, కంటి నల్ల గుడ్డు నిర్జీవమై, చిన్న పిల్లల్లో శాశ్వతమైన గ్రుడ్డి తనం ఏర్పడుతుంది. సాధారణ రోగ సంక్రమణాల నుండి రక్షణ కల్పించడంలో విటమిన్-ఎ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆకు పచ్చ లేదా ముదురు పసుపు పచ్చ లేదా నారింజ రంగులో ఉండే కూరగాయలు, పండ్లు అంటే ఆకుకూరలు, క్యారెట్లు, టమాటలు, చిలగడ దుంపలు, బొప్పాయి, మామిడి మొదలైన వాటిలో కెరొటినాయిడ్లు పుష్కలంగా ఉంటాయి.

### 2. ఇనుము

రక్తంలోని ఎర్ర రక్త కణాలలో ఉండే ఎరుపు రంగు "హీమోగ్లోబిన్" తయారవడానికి ఇనుము అవసరమైన మూలకం. కణాలకు ప్రాణ వాయువు అందడానికి హిమోగ్లోబిన్ అవసరం. పాలిపోయినట్లు ఉండడం, విపరీతమైన అలసట, రోగ సంక్రమణలకు సులభంగా గురి కావడం, మొదలైన లక్షణాలను చూపే రక్త హీనతకు హీమోగ్లోబిన్ తక్కువ కావడం కారణం. ఆకుకూరల్లో ఇనుము ఎక్కువ మోతాదుల్లో ఉంటుంది. కాని శరీరం ఇనుమును పరిమితంగా గ్రహిస్తుంది. దాన్ని ఎక్కువగా చేయడానికి విటమిన్-సి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను రోజు తీసుకోవాలి.

### 3. విటమిన్-సి

విటమిన్-సి ఆరోగ్యకరమైన ఎముకలు, పళ్ళకు అత్యవసరమైన పోషకం. శరీరం ఇనుమును గ్రహించడానికి విటమిన్-సి సహాయపడుతుంది. విటమిన్-సి లోప పరిస్థితుల్లో, నీరసం, పంటి చిగుర్ల వెంట రక్తం కారడం

ఎముకల పెరుగుదలలో లోపం కనిపిస్తుంది. తాజా ఉసిరి, నారింజ వంటి పుల్లటి పండ్లు, జామ, అరటి పండు, టమాట వంటి కూరగాయల్లో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది.

### 4. ఫోలిక్ ఆమ్లం

రక్తం తయారవడానికి అవసరమైన ఫోలిక్ ఆమ్లం ఎఱ్ర రక్త కణాలు ఎక్కువవడానికి, పూర్తి అభివృద్ధికి సహాయపడుతుంది. ఫోలిక్ ఆమ్లం మెగాలో లోపం బ్లాస్టిక్ రకం రక్తహీనతకు దారి తీస్తుంది. గర్భంతో ఉన్న సమయంలో తల్లి ఫోలిక్ ఆమ్లం తీసుకోవడం వల్ల పిండానికి జననంలో ఏర్పడే కొన్ని అవలక్షణాలు రాకుండా రక్షణ ఏర్పడుతుంది. ఫోలిక్ ఆమ్లం లోపం వల్ల రక్తంలో హీమోసిస్టిన్ స్థాయి పెరిగి, తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువవుతుంది. ఆకుకూరలు, పప్పురకం పదార్థాలు, చిక్కుడు మొదలైన కాయలు, పోలెట్లను ఎక్కువగా కలిగి ఉంటాయి.

### కూరగాయలు మరియు పండ్లలో లభించే పోషకేతర పదార్థాలు

మానవ శరీరానికి, ఆరోగ్య కారకమైన కొన్ని పోషకేతర పదార్థాలను కూడా కూరగాయలు మనకు అందిస్తాయి. వాటిలో ఆహారం లోని పీచుపదార్థం, యాంటి ఆక్సిడెంట్లు, పోషకాలు కాని ఈ అంశాలు వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడానికి, కంట్లో శుక్లం, గుండె జబ్బులు, క్యాన్సరు వంటి రోగాలకు దారి తీసే ప్రక్రియలను నిరోధించడానికి అవసరమవుతాయి.

### 1. పీచుపదార్థం

గ్రహించిన ఆహారం ప్రేగుల నుండి ప్రయాణించడాన్ని ఆలస్యం చేయడానికి పీచుపదార్థం (ఫైబర్) సహాయపడుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకాన్ని తగ్గించి మల విసర్జనానికి దోహదపడి, డైవర్టిక్యులర్ జబ్బు వంటి వాటిని నిరోధిస్తుంది. కోలన్ క్యాన్సర్ రాకుండా కూడా రక్షిస్తుంది.

### 2. యాంటి ఆక్సిడెంట్లు

కణాలు, వాటి అంతర్భాగాలకు ఆక్సిజన్ ఫ్రీరాడికల్స్ కలిగించే హానిని యాంటి ఆక్సిడెంట్లు పరిమితం చేస్తాయి. కొన్ని జబ్బుల నుండి రక్షణ కలిగించడంలో అవి ప్రముఖ పాత్రను వహిస్తాయి. ఫ్రీ రాడికల్స్ యొక్క దుష్ప్రభావం వల్ల అథెరోస్క్లె రోసిస్, క్యాన్సర్, కీళ్ళ నొప్పులు, ఉబ్బసం జబ్బు, మదుమేహం లాంటి జబ్బులు వస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరలు ఉదా : ఆకుకూరలు, క్యారెట్లు, తాజాగా ఉండే పుల్లటి పండ్లు, టమాట.

భారతీయ వైద్య పరిశోధనా మండలి వారు ఏర్పరచిన నిపుణుల కమిటీ, వ్యక్తుల పోషణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు సగటున రోజుకు కనీసం 150 గ్రా. కూరగాయలు (ఆకుకూరలు-40 గ్రా. ఇతర కూరగాయలు-60 గ్రా. దుంపలు, గడ్డలు-50 గ్రా.) తీసుకోవాలని సిఫార్సు చేశారు. వాటితో పాటు ఆయా కాలాన్ని బట్టి 100 గ్రా. తాజా పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలి. కాని దీర్ఘకాల జబ్బులను నిరోధించడానికి వయస్కులు రోజుకు కనీసం 300 గ్రా. కూరగాయలు, 100 గ్రా. పండ్లు తీసుకోవాలి.

### వండడం వల్ల కలిగే పోషక నష్టం నివారించాల్సిన పద్ధతి

ముందే ముక్కలు చేయబడిన కూరగాయలను కడిగినప్పుడు ఆహార పదార్థాలను వండినప్పుడు, విటమిన్లు నష్టమవుతాయి. కాని సరియైన వంట పద్ధతులను పాటించడం ద్వారా ఆ నష్టాలు రాకుండా చూసుకోవాలి. తాజాగా వండకుండా, బాగా కడిగిన, పచ్చిగానే ఉండే కూరగాయలను తీసుకోవడం ఎప్పుడూ లాభదాయకమే.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7036825213

## టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయు శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

ఆర్. సుధాకర్ రెడ్డి మరియు వి.ఎల్. నారాయణమ్మ
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్.

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| **I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 5.30-6.30** | | | |
| 1. | 06.09.17 | వ్యవసాయంలో బదనికల సంరక్షణ | డా॥ ఎస్.జె. రహమాన్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ అఖిల భారత జీవ నియంత్రణ పరియోజన, ఏ.ఆర్.ఐ, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9848421791 |
| 2. | 08.09.17 | మిశ్రమ వ్యవసాయం-ఉపయోగాలు | డా॥ జి. గోవర్ధన్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం రాజేంద్రనగర్, హైదరాబాద్, 9440467091 |
| 3. | 15.09.17 | ప్రత్తిలో సస్యరక్షణ | డా॥ బి. రాం ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9963073087 |
| 4. | 22.09.17 | వరిలో సస్యరక్షణ | డా॥ ఆర్. జగదీశ్వర్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ వరి పరిశోధనా విభాగం, ఏఆర్ఐ, రాజేంద్రనగర్, హైదరాబాద్ 9490191163, 8179540261 |
| **II. టి.వి.-5 (అన్నపూర్ణ): సాయంత్రం 5.30 - 6.00** | | | |
| 1. | 01.09.17 | జీవన ఎరువులు-ఉపయోగాలు | డా॥ ఎస్. త్రివేణి, అసోసియేట్ ప్రొఫెసర్ వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ 7032924539, 8332024539 |
| 2. | 08.09.17 | వరిలో సస్యరక్షణ | డా॥ ఎస్. మాలతి, సీనియర్ శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ 9848481818 |
| 3. | 15.09.17 | అటవి వ్యవసాయం-ఉపయోగాలు | డా॥ ఆరిఫ్ ఖాన్, ప్రధాన శాస్త్రవేత్త అగ్రోఫారెస్ట్రీ విభాగం, ఏఆర్ఐ, రాజేంద్రనగర్, హైదరాబాద్ 9701876662 |
| **III. జై కిసాన్ : సాయంత్రం 5.00-6.00** | | | |
| 1. | 07.09.17 | వరిలో సస్యరక్షణ | డా॥ ఎన్.ఆర్.జి. వర్మ, సీనియర్ శాస్త్రవేత్త వరి పరిశోధనా విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్ 9912079464 |

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | | **III. జై కిసాన్ : సాయంత్రం 5.00-6.00** |
| 2. | 14.09.17 | రబీ మొక్కజొన్న సాగు | **శ్రీమతి వి. స్వర్ణలత,** శాస్త్రవేత్త<br>మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్<br>9885042831 |
| 3. | 21.09.17 | రబీకి అనువైన నూనె గింజల పంటలు | **డా॥ యం.వి.నగేష్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం<br>8008404874 |
| 4. | 28.09.17 | రబీ కంది, శనగ, పెసర, మినుము సాగు | **డా॥ పి. జగన్మోహన్ రావు,** ప్రధాన శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్<br>9849133493 |

## వ్యవసాయ విశ్వవిద్యాలయ వివిధ తెలుగు ప్రచురణల ధరలు

**వ్యవసాయ పంచాంగం 2017-18*** రూ. 120/-

**వివిధ పంటల నాశించు చీడ పీడలు - వాటి నివారణ, రోగ నిర్ధారణ ప్రచురణలు - వాటి ధరలు****

| | | | | | |
|---|---|---|---|---|---|
| వరి | రూ. 50/- | ప్రత్తి | రూ. 50/- | మొక్కజొన్న | రూ. 50/- |
| వేరుశనగ | రూ. 40/- | సోయాచిక్కుడు | రూ. 40/- | ఆముదం | రూ. 40/- |

* రిజిష్టర్డ్ పార్సెల్+ప్యాకింగ్ రూ. 80/- ** పోస్టల్ ధర (రూ॥) 25/-

## వివిధ డివిడిల ధరలు***

| | | |
|---|---|---|
| 1. | వరిలో పురుగులు & తెగుళ్ళు - సమగ్ర యాజమాన్యం | రూ॥ 40/- |
| 2. | వరిసాగు మెళకువలు, నాణ్యతా ప్రమాణాలు & విత్తనోత్పత్తి | రూ॥ 40/- |
| 3. | మొక్కజొన్న సస్యరక్షణ | రూ॥ 40/- |
| 4. | మొక్కజొన్న యాజమాన్యం - జిరోటిల్లేజి, బేబి కార్న్‌సాగు | రూ॥ 40/- |
| 5. | పుట్టగొడుగుల పెంపకం | రూ॥ 40/- |
| 6. | తేనెటీగల పెంపకం | రూ॥ 40/- |
| 7. | పంటలలో సూక్ష్మపోషకాల ప్రాముఖ్యత - లోపాలగుర్తింపు, సవరణ మరియు నివారణ | రూ॥ 40/- |
| 8. | మినుము సాగు | రూ॥ 40/- |
| 9. | పెసర సాగు | రూ॥ 40/- |
| 10. | ప్రత్తిలో గులాబి రంగు కాయ తొలుచు పురుగు సమగ్ర యాజమాన్యం | రూ॥ 40/- |
| 11. | నువ్వుల సాగు | రూ॥ 40/- |
| 12. | సోయా చిక్కుడు సాగు | రూ॥ 40/- |

*** పోస్టల్ ధర. రూ. 30/-

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా॥పి.స్వర్ణశ్రీ మరియు డా॥ సి.హెచ్.భరత్‌భూషణ్ రావు
ఫార్మర్స్ కాల్ సెంటర్ (పరిష్కారం), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం,
6వ అంతస్తు, అశోక రఘుపతి చాంబర్, బేగంపేట, హైదరాబాద్

**ప్ర. 20 రోజుల ప్రత్తిలో ఎరువుల వాడకం తెలపండి?**

సంజు, భైంసా, నిర్మల్ జిల్లా.

జ. 33 కిలోల యూరియా మరియు 13 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి.

**ప్ర. ప్రత్తిలో మెగ్నీషియం లోప నివారణ తెలపండి?**

రమేష్, తిమ్మపేట, వరంగల్ జిల్లా.

జ. లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45 మరియు 75 రోజుల తరువాత రెండుసార్లు పిచికారి చేయాలి.

**ప్ర.బీరలో రకాలు తెలపండి?**

లక్ష్మణ్, ముత్తారం, పెద్దపల్లి జిల్లా.

జ. జగిత్యాల లాంగ్, జైపూర్ లాంగ్, పూసా నస్దర్, అర్క సుజాత, అర్క సుమీత్

**ప్ర. 20 రోజుల సోయాచిక్కుడులో కలుపు నివారణ తెలపండి?**

రాజు, సబ్బపూర్, నావిపేట, నిజామాబాద్ జిల్లా.

జ. ఇమాజిథ్‌పైర్ (పర్స్యూట్) అనే మందు ఎకరాకు 250-300 మి.లీ. లేదా పినాక్సిప్రాప్-పి-ఇథైల్ (విప్ సూపర్) 250 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి.

**ప్ర. 20 రోజుల పసుపులో కలుపు మందులు తెలపండి?**

ఉత్తమ్ రాథోడ్, జన్నారం, మంచిర్యాల జిల్లా.

జ. క్విజాల్‌ఫాప్-పి- ఇథైల్ (టర్గా సూపర్) 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ (ఎజిల్) 250 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి.

**ప్ర. మునగ రకాలు తెలపండి?**

శ్రీనివాస్, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా.

జ. పి.కె.యం-1, జాఫ్నా మొదలగునవి

**ప్ర. ప్రత్తిలో జింకు లోప నివారణ తెలపండి?**

భావీద్, తలమడుగు, ఆదిలాబాద్ జిల్లా.

జ. ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. 2 గ్రా. జింకు సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**ప్ర. నువ్వులు విత్తే సమయం మరియు రకాలు తెలపండి?**

ఆంజనేయులు, సిద్ధిపేట గ్రా॥, సిద్ధిపేట జిల్లా.

జ. నువ్వులు లేట్ ఖరీఫ్ అనగా ఆగష్టు రెండవ పక్షం విత్తుకోవచ్చు. మరియు రకాలు శ్వేతాతిల్, హిమ, రాజేశ్వరి, చందన, ఎలమంచిలి-66, గౌరి, మాధవి మొదలగునవి.

**ప్ర.కందిలో రకాలు తెలపండి?**

ప్రసాద్, ఖమ్మం జిల్లా.

జ. ఎల్.ఆర్.జి.-41, లక్ష్మి, ఆశ, మారుతి, డబ్ల్యు.ఆర్.జి. -27, పాలెం కంది, దుర్గ, సూర్య, వరంగల్ కంది-53, తాండూరు తెల్లకంది, రుద్రేశ్వర, హనుమ, ఉజ్వల, మన్నెంకొండ కంది మొదలగునవి.

**ప్ర. ప్రత్తిలో రకాలు తెలపండి?**

కృష్ణ, ఉప్పునూతల, కృష్ణా జిల్లా.

జ. నరసింహా, శివనంది, శ్రీరామ, ఓరుగల్లు, కృష్ణ, డబ్ల్యు.జి.సి.వి-48, 49, ఎడిబి-39 మొదలగునవి.

**ప్ర. వరిలో జింకు లోప నివారణ తెలపండి?**

సాగర్, హాజీపూర్, మంచిర్యాల

జ. లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి పిచికారి చేసుకోవాలి.

**ప్ర. 2 సం॥ మామిడిలో ఎరువులు తెలపండి?**

మురళీధర్, ముధోల్, నిర్మల్ జిల్లా.

జ. 200 గ్రా. నత్రజని అనగా యూరియా 435 గ్రా., 200 గ్రా. భాస్వరం, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అయితే 1250 గ్రా. పొటాష్, 100 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అయితే 335 గ్రా. వేసుకోవాలి.

**ప్ర. సపోట రకాలు తెలపండి?**

శేఖర్, చిట్యాల, నల్గొండ జిల్లా

జ. క్రికెట్ బాల్, పాల, ద్వారపూడి, కీర్తిబర్తి, కలిపత్తి, పి.కె.యం-1, పి.కె.యం-3, డి.హెచ్.యస్-1&2.

**ప్ర. పుచ్చ రకాలు తెలపండి?**

హనమప్ప, పిట్లం, కామారెడ్డి

జ. అపాహి, యమాటా, సుగర్‌బేబి, అర్కజ్యోతి, అర్కమానిక్, దుర్గాపూర్ కేసర్, దుర్గాపూర్ మీరా మొదలగునవి.

**ప్ర. మిరపలో వేరు పురుగు నివారణ తెలపండి?**

**వీరన్న, పరకాల గ్రా. మరియు వరంగల్ జిల్లా.**

జ. వేరు పురుగు యొక్క తల్లి పురుగులు తొలకరి వర్షాల సమయంలో పొలంలో మిరప చెట్లను ఆశిస్తాయి. బాగా ఎదిగిన పురుగు మొక్క వేర్లను కత్తిరిస్తుంది. తేలికపాటి నేలల్లో ఎక్కువగా ఆశిస్తుది. మొక్కలు పీకితే సులువుగా ఊడి వస్తాయి. నివారణకు ఫోరేట్ 10 శాతం గుళికలు ఎకరాకు 6 కిలోలు వేయాలి.

**ప్ర. బీరలో ఆకు పసుపు రంగులోకి మారుతుంది, నివారణ తెలపండి?**

**లక్ష్మణ్, మూలారం గ్రా. మరియు మం., పెద్దపల్లి జిల్లా.**

జ. బూడిద ఆకు తెగులు ఒక మాదిరి వర్షంతో కూడుకున్న చల్లని వాతావరణంలో ఆశిస్తుంది. మొదట లేత ఆకుపచ్చ, ముదురాకుపచ్చ కలిపి మొజాయిక్ వలే కనిపిస్తుంది. తరువాత ఆకులపై పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకులు రంగుబారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి 25 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. మెటలాక్సిల్ కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. సోయాచిక్కుడులో పచ్చ పురుగు నివారణ తెలపండి**

శ్రీధర్, నేరడిగొండ గ్రా. మరియు మం., ఆదిలాబాద్ జిల్లా.

జ. సోయాబీన్ ఆకులను పచ్చ పురుగులు గోకి తిని నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. పసుపులో దుంపకుళ్ళు నివారణ తెలపండి?**

రాథోడ్, జన్నారం గ్రా. మరియు మం., మంచిర్యాల జిల్లా.

జ. ఎండు లక్షణాలు మొదట ఆకుల అంచుల నుండి మొదలై ఆకంతా వ్యాపిస్తుంది. మొక్కలో కొన్ని వేర్లు మాత్రం గోధుమ రంగులో వుండి మిగతావి కుళ్ళి పోతాయి. కుళ్ళు కొమ్మలకు పాకి అవి మెత్తగా ఉండి కుళ్ళిపోతాయి. నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెటలాక్సిల్ 3 గ్రా. కలిపి మొక్కల చుట్టూ తడపాలి.

**ప్ర. మొక్కజొన్నలో కండె పురుగు నివారణ తెలపండి?**

శ్రీశైలం, మద్దిరెడ్డిపల్లి గ్రా., నవాబ్‌పేట మం., వికారాబాద్ జిల్లా.

జ. మొక్కజొన్న కండెను గులాబిరంగు పురుగు మరియు శనగపచ్చపురుగు నష్టపరుస్తాయి. నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ తెలపండి?**

నారాయణ, కామారెడ్డి గ్రా. మరియు మం., కామారెడ్డి జిల్లా

జ. కందిలో పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను, పూతను చుట్టూచుట్టుకొని లోపల ఉండి గీకి తింటుంది. గీకి తినటం వలన ఆకులు తెల్లగా కనబడతాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ లేదా క్వినాల్‌ఫాల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. వరిలో తెల్ల తెగులు నివారణ తెలపండి?**

సురేష్, దొండపల్లి గ్రా. మరియు మం., మంచిర్యాల జిల్లా.

జ. ఆకులు నిలువుగా ముడుచుకొని తెల్లని గీతలు, ఆకు ముడతలు విడదీస్తే లేత పసుపు లేదా ఆకుపచ్చ లార్వాలు కనిపిస్తాయి. నివారణకు పిలక దశలో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక ఎసిఫేట్ 1.5 గ్రా. పోటాకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ బి.డబ్ల్యు.జి 0.25 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 480 యస్.సి. 0.1 మి.లీ.లను పిచికారి చేసుకోవాలి.

**ప్ర. మొక్కజొన్నలో వడలు తెగులు నివారణ తెలపండి?**

నిరంజన్, కొత్తగూడెం గ్రా. మరియు మం., భద్రాది కొత్తగూడెం జిల్లా.

జ. మొక్కలు పైనుండి క్రిందికి వడలి ఆకులు లేత ఆకుపచ్చ రంగుకు మారి తరువాత ఎండిపోతాయి.కాండాన్ని చీల్చి చూసినప్పుడు ఎరుపు/గోధుమ రంగుకు మారిన బెండును గమనించవచ్చు. నివారణకు 2 కిలోల ట్రైకోడర్మా శిలీంధ్రాన్ని 100 కిలోల పశువుల ఎరువుతో వృద్ధి చేసి వరుసగా 3-4 సం॥లు భూమిలో కలపాలి.

**ప్ర. వేరుశనగలో నల్లి నివారణ తెలపండి?**

సోమయ్య, వర్ధన్నపేట గ్రా. మరియు మం., వరంగల్ రూరల్ జిల్లా.

జ. పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగు భాగాన ఉండి రసం పీల్చుతూ వుంటాయి. ఆకులు పసుపు రంగుకు మారి ముడుచుకొని పోయి దోనె ఆకారంగా మారి పోతాయి. నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. లేదా ప్రొపర్గైట్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. బెండలో పల్లాకు తెగులు నివారణ తెలపండి?**

భూపాల్, మోత్కూర్ గ్రా. మరియు మం., యాద్రాది కొత్తగూడెం జిల్లా.

జ. పల్లాకు తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపించును. తెగులు సోకిన ఆకులు పసుపు రంగుకి మారి గిడసబారి తెల్లగా మారిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా ట్రైజోఫాస్ కలిపి పిచికారి చేయవలెను.

**ప్ర. ప్రత్తిలో గులాబిరంగు పురుగు నివారణ తెలపండి?**

శేఖర్, బెలా గ్రా. మరియు మం., ఆదిలాబాద్ జిల్లా.

జ. నివారణకు పురుగు గ్రుడ్లను, మొదట దశలో ఉన్న పురుగులను నివారించడానికి 5 శాతం వేప గింజల ద్రావణాన్ని పిచికారి చేయాలి. రెండు లేక మూడవ దశలో వున్న పురుగుల నివారణకు లీటరు నీటికి 3 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 2 మి.లీ. ప్రొఫినోఫాస్ లేదా 2 మి.లీ. ట్రైజోఫాస్ పిచికారి చేయాలి.

**ప్ర. వరిలో సుడిదోమ నివారణ తెలపండి?**

పోశయ్య, లింగంపేట గ్రా. మరియు మం., కామారెడ్డి జిల్లా.

జ. గోధుమ వర్ణపు దోమలు దుబ్బుల అడుగున నీటి మట్టంపై వుండి దుబ్బుల నుండి రసాన్ని పీలుస్తాయి. పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. నివారణకు పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలి బాటలు వదలాలి. మరియు ఉధృతిని బట్టి నివారణకు ఇథోఫెన్‌ప్రాక్స్ 1.5 మి.లీ. లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.30 గ్రా. థయోమిథాక్సామ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్ర.సీతాఫలం ఆకులపై నల్లటి మచ్చలు వస్తున్నాయి? ఏమి చేయాలి?**

వీరభద్ర, జీవంగి గ్రా., బషీరాబాద్ మం., వికారాబాద్ జిల్లా.

జ. ఆకులపై నల్లటి మచ్చలు ఏర్పడి నష్టాన్ని కలిగిస్తాయి. నివారణకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపి పిచికారి చేయాలి.

**ప్ర. టమాటలో ఆకులు మాడి ఎండిపోతున్నాయి, నివారణ తెలపండి?**

శ్రీనివాస్, చందుర్తి గ్రా. మరియు మం., రాజన్న (సిరిసిల్లా) జిల్లా.

జ. తేమ గల చల్లని వాతావరణంలో ఆకుమాడు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. ఆకుల మీద, కాండం మరియు కాయల మీద మొదట గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి తర్వాత ఆకులు మాడి ఎండిపోతాయి. నివారణకు 3 గ్రా. కాప్టాన్ లేదా మాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 1800 425 1110**

## వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జాతీయ పి.ఆర్ అవార్డులు

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ ఛాప్టర్ నిర్వహించిన 2వ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ క్యాటగిరీలలో నాలుగు జాతీయ అవార్డులను కైవసం చేసుకొంది. పత్తి పంటను ఆశించే గులాబి రంగు పురుగు నివారణపై రూపొందించిన వీడియో, వ్యవసాయంలో మహిళా రైతుల భాగస్వామ్యం, శ్రమ నుంచి సౌకర్యం వైపు అన్న థీమ్‌తో రూపొందించిన వీడియో ఫీచర్, యూనివర్సిటీ క్యాలెండర్, ఆన్‌లైన్ లైబ్రరీ సేవలకు అవార్డులు లభించాయి. వివిధ క్యాటగిరీలలో అవార్డులను పొందిన శాస్త్రవేత్తలను, అధికారులను ఉపకులపతి డా॥ వి.ప్రవీణ్ రావు అభినందించారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 83వ జయంతి ఉత్సవాలు

ప్రొఫెసర్ జయశంకర్ కన్న కలలను సాకారం చేసేదిశగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు బంగారు తెలంగాణ నిర్మాణం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర జలవనరుల యాజమాన్య సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ 83వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి డా॥వి.ప్రవీణ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే గడిచిన మూడేళ్ళలో ప్రొఫెసర్ జయశంకర్



నినాదమైన నీళ్ళు, నిధులు, నియామకాలలో తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం విడిపోకముందు తెలంగాణ ప్రాంతానికి కేవలం 14 కోట్లు బడ్జెట్ మాత్రమే ఉండగా ప్రత్యేక రాష్ట్రంలో వ్యవసాయ విశ్వ విద్యాలయానికి 320 కోట్లు బడ్జెట్ అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది గోపి రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డా॥ఎన్.సుధీర్ కుమార్, డా॥ మనోహరరావు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే విశ్వవిద్యాలయానికి మంచి ర్యాంకు – డా॥ వి.ప్రవీణ్‌రావు

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడిన అనతికాలంలోనే పి.జె.టి.ఎస్.ఏ.యు కు దేశంలోనే 12వ ర్యాంకు రావడానికి అందరి సమష్టి కృషి ఉందని ఉపకులపతి డా॥ వి.ప్రవీణ్ రావు అన్నారు. విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద జరిగిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణను చేసి సిబ్బంది, విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. హరిత విప్లవం తర్వాత దేశంలో వ్యవసాయానికి ఎనలేని ప్రాధాన్యత పెరిగిందని, అలాగే రైతుల ఆధాయాన్ని రెట్టింపు చేయడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది, సమష్టి కృషి అవసరమని అన్నారు. ఆహారభద్రత కల్పించడంలో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ళను అధిగమించడానికి ఉన్న పరిమిత వనరులతోనే సంవృద్ధిగా ఆహారధాన్యాల ఉత్పత్తికి కృషి జరుగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వేడుకలలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వర్సిటిలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

గ్రంథాలయ సేవల విస్తరణలో డిజిటలైజేషన్‌ను విరివిగా వినియోగించుకోవాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ వి.ప్రవీణ్‌రావు అన్నారు. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో డా॥ఎస్.ఆర్.రంగనాథన్ 125వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ గ్రంథపాలకుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకప్పుడు సమాచారం కోసం లైబ్రరీలకు వెళ్లేవారని, డిజిటలైజేషన్‌తో గ్రంథాలయాల సేవలు మొబైల్ ద్వారా అందే రోజులు వచ్చాయని అన్నారు. విశ్వవిద్యాలయ లైబ్రేరియన్ డా॥ కె.వీరాంజనేయులు కేంద్ర గ్రంథాలయం అందిస్తోన్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

*వి. సుధాకర్, పి.ఆర్.ఓ*

# ప్రత్తిలో పెసరని అంతరపంటగా సాగు

డా॥ వై. ప్రవీణ్ కుమార్, వై. రాజా, రవి పొత్తులు మరియు ఇ. శివ చరణ్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

ఆదిలాబాద్ పేరు వినగానే గుర్తుకు వచ్చేవి పచ్చని అడవుల అందాలు మరియు గిరిజన ప్రాంతాలు. గిరిజన ప్రాంతంలో ప్రజల జీవనాధారం వ్యవసాయం. అలాంటి ప్రాంతాలలో రైతుల వ్యవసాయ ఆదాయం చాలా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్తి 3.6 లక్షల హెక్టార్లలో వర్షాధార పంటగా సాగుచేయబడుతున్నది.

ఈ మధ్య కాలంలో వాతావరణంలో వచ్చిన మార్పులు, ఒకే పంటని సాగు చేయడం, సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టకపోవడం పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ జిల్లాలో సర్వే నిర్వహించి 2016 వ సంవత్సరం షేక్‌గూడ అనే గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకోవడం జరిగినది. ఈ గ్రామంలో రైతులు అధికంగా ప్రత్తిని ఏక పంటగా సాగు చేసేవారు. పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. కాని దిగుబడిలో పెద్దగా మార్పు లేకపోయింది. దీనికి ముఖ్యకారణం భూమి లోతు మరియు భూమి సారవంతం చాలా తక్కువగా ఉండడం.

ఇలాంటి పరిస్థితులలో షేక్ గూడ గ్రామానికి చెందిన గోవింద్ రావ్ అనే రైతు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ప్రత్తిలో అంతర పంటగా మధిర పెసర (యం.జి.జి-347) ను 1:1 నిష్పత్తిలో వేయడం జరిగింది. ఈ రకం మొక్కలు నిటారుగా పెరుగుతాయి. గింజ లావుగా ఉండి, అధిక దిగుబడి కలిగి, మొవ్వు కుళ్ళు మరియు ఆకు మచ్చ తెగుళ్ళను తట్టుకుంటుంది.

ప్రస్తుతం గోవింద్ రావ్ ప్రత్తిలో 120×30 సెం.మీ. వరుసల మధ్య, మొక్కల మధ్య దూరాన్ని పాటిస్తున్నాడు. పత్తిలో తక్కువ కాల పరిమితి కల్గిన, లెగ్యుమినేసి కుటుంబానికి చెందిన పెసరను అంతర పంటగా సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడంతో పాటు వాతావరణంలోని నత్రజనిని నేలలో నిక్షిప్తం చేయడం వలన నేల సారవంతం అవుతుంది. అంతే కాకుండా ఈ రకం కరువు పరిస్థితుల్ని సమర్థవంతంగా తట్టుకుంటుంది.

**కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ సూచించిన యాజమాన్య పద్ధతులు :**

- విత్తన శుద్ధి : కిలో విత్తనానికి 200 గ్రాముల రైజోబియం మరియు 8-10 గ్రాములు ట్రైకోడేర్మ విరిడి.
- ఎకరానికి 10 పసుపు రంగు జిగురు వలలు అమర్చుకోవడం.
- ఎకరానికి 6 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం.
- పంట పూత దశలో వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం.
- పూత మరియు గింజ తయారయ్యే దశలో 19:19:19 ఎరువు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పై పాటుగా అందించడం.
- క్లోరిపైరిఫాస్ (50% ఇ.సి) 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం.

ప్రత్తిని ఏక పంటగా పండించడం వలన హెక్టారుకు రూపాయలు 64,400 నికర ఆదాయం రాగా, అదే ప్రత్తిలో పెసరని 1:1 నిష్పతిలో అంతర పంటగా వేసిన గోవింద్ రావ్ పైన సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించడం వలన 13,900 రూపాయల అదనపు ఆదాయాన్ని పొందాడు.

రైతులు ప్రత్తి (ఏక పంట) తో పోల్చుకుంటే ప్రత్తిలో పెసర అంతర పంటగా వేయడం ద్వారా అధిక దిగుబడితో పాటు లాభాలను పొందవచ్చని గోవింద్ రావ్ నిరూపించాడు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9989623829



# కూరగాయల సాగుతో లాభాలు ఆర్జిస్తున్న రైతు

డా॥ ఆర్. ఉమారెడ్డి మరియు ఎ.సతీష్
ఏరువాక కేంద్రం, వరంగల్

అశోక్ రెడ్డి, అమ్మాపురం గ్రామానికి చెందిన ఈ రైతు తనకున్న వ్యవసాయ భూమిలో పూర్తిగా కొత్త పద్ధతులను అవలంభించి వ్యవసాయం చేయడం జరుగుతుంది. ముఖ్యంగా కూరగాయలను అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. దీనిలో కూడా పెండాల్ వంటి నూతన పద్ధతులను అవలంభించి సాగు చేస్తున్నారు. అదే విధంగా అతనికి ఉన్న మొత్తం వ్యవసాయ భూమిని డ్రిప్ ద్వారా మాత్రమే నీరు అందించడం జరుగుతుంది. తద్వారా నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికి సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం జరుగుతుంది. అదే విధంగా మల్చింగ్‌ను కూడా అవలంభించడం ద్వారా కలుపు తక్కువగా వచ్చి కూలీల కొరత అధిగమించడానికి ఉపయోగ పడుతుంది. ఎండా కాలంలో తేమ లభ్యతను ఎక్కువకాలం నిలిపి ఉంచడానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఈ రైతు వివిధ పంటలకు సంబంధించిన కొత్త రకాలను అన్వేషించి సాగు చేయడంతో పాటు తోటి రైతులకు తెలియజేయడం జరుగుతుంది. అలాగే సంవత్సరం పొడవునా ఆదాయం పొందడానికి తన భూమిని విభజించి ప్రణాళిక బద్దంగా ఒక పంట తరువాత మరొక పంట వేస్తూ అధిక లాభాలను పొందుతున్నాడు. దీనితో పాటు తన చుట్టూ ఉన్న రైతులకు డ్రిప్ యొక్క ఆవశ్యకత తెలియజేసి వారితో డ్రిప్ పద్ధతిని పాటించే విధంగా తీర్చిదిద్దారు. దీనికి గాను వీరిని డ్రిప్ అశోక్ అని చుట్టూ ప్రక్కల రైతులు పిలవడం జరుగుతుంది. అదే విధంగా ఎరువులను కూడా డ్రిప్ ద్వారా అందించడం ద్వారా ఎరువులను సమర్ధవంతంగా వినియోగించుకోవడం జరుగుతుంది.

ఈ రైతు వ్యవసాయం మీద ఉన్న మక్కువతో వ్యవసాయ శాస్త్రవేత్తలతో మరియు అధికారులతో మంచి అనుబంధాన్ని కలిగి ఉండి వారి ద్వారా కొత్త పథకాలను తెలుసుకొని సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం జరుగుతుంది.

పెండాల్ విధానంలో బీర సాగు ఆదాయ వ్యయాలు
ఎకరాకు: **రకం : నాగ బీర రకం**

| వివరాలు | పెండాల్ విధానంలో బీర సాగు |
|---|---|
| విత్తన మోతాదు - | 650 గ్రా॥ |
| విత్తన ఖర్చు - | రూ. 4,800/- |
| దున్నడం ఖర్చు - | రూ. 2400/- |
| విత్తడానికి కావలసిన కూలీలు ఖర్చు - | రూ. 5×200×రూ. 1000 |
| పెండాల్ ఖర్చు - | రూ. 2,17,500/ఎకరాకు (10 సంవత్సరాల జీవిత కాలం 1సంవత్సరం-రూ. 20,000) |
| ఎరువులు నీటిలో కరిగేవి - | రూ. 6,000/- |
| డ్రిప్ - | రూ. 40,000 /ఒక సంవత్సరం రూ. 5,000/-) |
| మల్చింగ్ ఖర్చు - | రూ. 12,500 |
| పెంట మట్టి ఖర్చు - | రూ. 7500 (5 ట్రక్కులు) |
| పురుగు మందుల ఖర్చు - | రూ. 5000/- |
| పంట కోత / మార్కెట్ | రూ. 12,000/- |
| స్టేకింగ్ ఖర్చు - | రూ. 3000/- |
| దిగుబడి | రూ. 8 టన్నులు |
| మొత్తం ఆదాయం | 8× రూ. 20,000= రూ. 1,60,000/ |
| మొత్తం ఖర్చు | రూ. 79,200/- |
| నికర ఆదాయం | రూ. 80,800/- (నాలుగు నెలల పంట కాలంలో) |

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9989523814**